RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 10 ISSUE NO : 10 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, జూన్, 27, 2025 FRIDAY, June,27,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-

## ఆపరేషన్ సిందూర్ మా హక్కు

### పాకిస్థాన్‌పై మరోసారి నిప్పులు చెరిగిన రక్షణ మంత్రి




బీజింగ్, జూన్ 26: ఉగ్రవాద చర్యలకు ఊతం ఇచ్చేలా వ్యవహరిస్తున్న పాకిస్థాన్‌పై భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి నిప్పులు చెరిగారు. గురువారం చైనాలో షాంఘై కోపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీ వో) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్య దేశాలకు చెందిన రక్షణ శాఖ మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని ఖండించారు. ఈ ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా మాట్లాడాలంటూ సభ్య దేశాల ప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం భారత్ హక్కు అంటూ కుండ బద్దలు కొట్టారు. కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాదాన్ని ఒక విధాన పరికరంగా మలుచుకున్నాయన్నారు. అందులోభాగంగా ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ తరహా ద్వంద విధానాలకు స్థానం లేదంటూ ఎస్‌సీవో సభ్య దేశాలకు ఆయన స్పష్టం చేశారు. అటువంటి దేశాల చర్యలను ఏ మాత్రం ఊపేక్షించకుండా ఖండించాలని ఆయా సభ్య దేశాలకు రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు భారత్ చర్యలు చేపట్టిందన్నారు. ఉగ్రవాదం వల్ల జరిగే పరిణామాలను ఆయన వివరించారు. వాటిని నిర్మూలించేందుకు తాము ఎంత మాత్రం వెనకాడబోమన్నారు. మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు ప్రారంభించాల్సి వచ్చింది.. ఆ దాడుల లక్ష్యం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటనే విషయాన్ని ఈ సందర్భంగా సభ్య దేశాలకు కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ వివరించారు. యువత తీవ్రవాదం వైపు వెళ్లకుండా నిరోధించేందుకు భారత్ సానుకూల చర్యలు చేపట్టిందని వివరించారు. భారతదేశం అధ్యక్షతన జరుగుతున్న ఈ సదస్సులో 'ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదాన్ని ఎదుర్కోవడంపై ఈ దేశాల మండలి సంయుక్త ప్రకటన విడుదల చేయడం ఈ సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతకు ప్రతీక అని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ ఎస్‌సీవో సదస్సు జూన్ 27వ తేదీతో ముగియనుంది.

## రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మినా...
## కొనుగోలు చేసినా కఠిన చర్యలు

### తెలంగాణలో ఈగల్ వ్యవస్థ.. లోగో ఆవిష్కరించిన సీఎం రేవంత్




**హైదరాబాద్,జూన్ 26:**తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంకీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ శిల్పకళా వేదికలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యాంటీ డ్రగ్, ఇల్లీగల్ ట్రాఫికింగ్ డే అవగాహన కాతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ యువతకు ప్రత్యేక స్థానంర్యక్రమంలో ఈగల్ వ్యవస్థ లోగోను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనం ఉంది. దేని మీద అయినా పోరాటం మొదలు పెడితే.. సాధించేవరకూ తెలంగాణ యువత నిద్రపోదు. తెలంగాణ రాష్ట్ర సాధనే ఇందుకు నిదర్శనం. అలాంటి తెలంగాణ యువత డ్రగ్స్‌కు బాసిన అవడం బాధాకరం. ఇక నుంచి రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మినా.. కొనుగోలు చేసినా కఠినంగా శిక్షిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇకపై నార్కొటిక్ బ్యూరోను.. ఈగల్‌గా పిలుస్తాం.. ఎక్కడ గంజాయి కనిపించినా ఈ ఈగల్ పట్టుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అంతకుముందు ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్మాట్లాడారు. రైజింగ్ తెలంగాణ స్ఫూర్తినిస్తోందని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వ చర్యలు బాగున్నాయని కొనియాడారు. ప్రభుత్వానికి మా తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందని రామ్ చరణ్ భరోసా ఇచ్చారు. ఆ తర్వాత విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. ఒక దేశాన్ని నాశనం చేయాలంటే వార్ అవసరం లేదు. యువతకు డ్రగ్స్ అలవాటు అయితే చేస్తే చాలు. ఆ దేశం నాశనం అయినట్లే. డ్రగ్స్ అలవాటు చేసే వారికి దూరంగా ఉండండి. డ్రగ్స్ జీవితాల్ని నాశనం చేస్తాయని విజయ్ దేవరకొండ పిలుపునిచ్చారు.

## తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు : ఈటల



**హైదరాబాద్,జూన్ 26:**తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా మన బోనాలు నిలుస్తాయని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు . ఆషాఢ మాసంలో తొలి బోనం ను గోల్కొండ లోని శ్రీ జగదాంబిక అమ్మవారికి సమర్పించే మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ఎక్స్ లో ఈ మేరకు పోస్టు చేశారు. ఈ ఆషాఢ మాసంలో లో జరిగే బోనాల పండుగ సందర్భంగా గోల్కొండ అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి తొలి బోనం ను అమ్మవారికి సమర్పిస్తారు. హైదరాబాద్ లో లష్కర్ బోనాల పేరుతో తెలంగాణ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రతి బస్తీతో ఆషాఢం, శ్రావణం రెండు మాసాల పాటు ప్రతి ఇంట్లో బోనం అమ్మవారికి సమర్పించుకుని తల్లికి పూజలు నిర్వహించి పిల్లలు, కుటుంబం, రాష్ట్రం చల్లగా ఉండేలా, పాడి పంటలతో ఏ కష్టాలు లేకుండా జీవించే భాగ్యం కలగాలని ఆనాదిగా ప్రతి సంవత్సరం బోనాల పండుగను నిర్వహించుకుంటున్నామని ఆయన అన్నారు . బోనాల పండుగ సందర్భంగా యావత్ ప్రజానికానికి శుభాకాంక్షలు, ప్రజలంతా కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించే భాగ్యం కలగాలని, జాతరను అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ సోదరులందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నానంటూ ఆయన తన పోస్టులో పేర్కొన్నారు .

## రాజ్యాంగమే అన్నిటికన్నా అత్యుత్తమైంది

### : జస్టిస్ బీఆర్ గవాయ్



**న్యూఢిల్లీ,జూన్, 26:**భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ భారత రాజ్యాంగమే దేశంలో అత్యున్నత అధికారం అని, ప్రజాస్వామ్యంలోని మూడు విభాగాలు – కార్యనిర్వాహక, శాసనసభ, న్యాయవ్యవస్థ – దానికిందనే కలిసి పనిచేయాలని అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి స్వస్థలమైన అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ పై వ్యాఖ్యలు చేశారు. 1973 కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు 'ప్రాథమిక నిర్మాణం' సిద్ధాంతాన్ని – అంటే పార్లమెంటు ఆమోదించిన సవరణల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలను మార్చలేమని ఉంది. దీన్ని ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంటుకు అధికారాలు ఉన్నాయి. కానీ, రాజ్యాంగ ప్రాథమిక స్వరూపాన్ని మార్చడం వీలవదన్నారు. రాజ్యాంగ విలువలతోపాటు సూత్రాలకు బాధ్యుడనే విషయాన్ని న్యాయమూర్తి అనుక్షణం గుర్తుంచుకోవాలి. మనకు అధికారం మాత్రమే కాకుండా బాధ్యత కూడా ఉందన్నారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల్లో ఏది అత్యున్నతమైందని తరచూ చర్చ తలెత్తుతోందని గవాయ్ అభిప్రాయపడ్డారు. చాలామంది పార్లమెంట్ అత్యున్నతమైందని అంటారు. కానీ, నా ఉద్దేశంలో భారత రాజ్యాంగమే అత్యంత ముఖ్యమైంది. ప్రజాస్వామ్యంలోని మిగిలిన మూడు విభాగాలు దానికిందే పనిచేస్తాయి. మనం ప్రజల హక్కులకు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం. తీర్పుల గురించి ప్రజలు ఏమనుకొంటున్నారు అనే అభిప్రాయం జడ్జీలను ప్రభావితం చేయకూడదు. మనం స్వతంత్రంగా ఆలోచించాలన్నారు. తాను రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు అండగా ఉంటానని పేర్కొన్నారు.

## వీలర్లకూ టోల్ విధిస్తారన్న ప్రచారాన్ని ఖండించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**హైదరాబాద్,జూన్ 26:** కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవేలపై టూవీలర్లకు టోల్ ఫీజు వసూలు చేస్తుందనే కథనాలు గురువారం సోషల్ మీడియా అంతటా చక్కర్లు కొట్టాయి. జూలై నుంచి ప్రభుత్వం ద్విచక్ర వాహనాలపై టోల్ విధించాలని భావిస్తోందని అనేక మీడియా సంస్థలు వెల్లడించాయి. అయితే, దీనిపై కేంద్రం స్పందించింది. కేంద్ర రోడ్డు రవాణా శాఖ మం త్రి నితిన్ గడ్కరీ అవాస్తవ ప్రచారాలపై మండిపడ్డారు. ఈ విషయంలో స్పష్టత కూడా ఇచ్చారు. జూలై 15 నుంచి బైకులకు టోల్ ఫీజు అమలవుతుందని జరిగే ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేశారు. అటు వంటి ఉద్దేశం కూడా లేదని, కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగానే తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాలకు టోల్ ఫీజు విషయంలో పూర్తిగా మినహాయింపు ఉంటుంది. సంచలనం సృష్టించడానికే ఇలాంటి తప్పుదారి పట్టించే వార్తలను వ్యాప్తి చేస్తున్నారు, మెరుగైన జర్నలిజానికి ఇది సరికాదు. దీనిని ఖండిస్తున్నానని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఇదే సమయంలో ద్విచక్ర వాహనాలపై టోల్ వసూలు చేసే ప్రణాళికలేవీ లేవని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) స్పష్టం చేసింది. ప్రస్తుతం నేషనల్ హైవేలపై ప్రయాణించేందుకు టూవీలర్లకు ఎలాంటి టోల్ ఫీజు లేదు. దీనికి సంబంధించి ఎన్‌హెచ్ఏఐ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో స్పష్టత ఇచ్చింది. అటువంటి పుకార్లను నమ్మవద్దని పేర్కొంది. టూవీలర్లపై టోల్ ఫీ అనే అంశమే ప్రతిపాదనలో లేదని తేల్చేసింది.



## మూడేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

### మంత్రి పియూష్ గోయల్ అంచనా



**న్యూఢిల్లీ,జూన్, 26:** వచ్చే మూడేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ మరింత దూసుకుపోనుందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. 2027 నాటికి భారత్ 5 ట్రిలియన్ డాలర్ల (రూ.430 లక్షల కోట్లు) జీడిపి సాధించొచ్చని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం, వ్యాపార సంఘాలు, పరిశ్రమలు సహా 140 కోట్ల మంది భారతీయులు ముందుకు వెళ్తున్నారన్నారు. మర్చంట్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండిస్ట్రీ (ఎంసిసిఐ) ఏర్పాటు చేసిన ఓ వర్చువల్ సెషన్‌లో మంత్రి పియూష్ గోయల్ మాట్లాడుతూ.. బలమైన స్థూల ఆర్థిక పునాదితో దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ దృఢంగా ఉందన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం అత్యల్పంగా మూడు శాతానికి తగ్గిందన్నారు. భారత్ 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థను అందుకోవడం కోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటి వాటిపై కీలక చర్యలను తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలిగేలా భారత్ తనను తాను మలుచుకుందన్నారు. రాబోయే దశాబ్ద కాలంలో దేశానికి డిజిటల్ మార్కెట్ కీలకమన్నారు.

## రైలు పట్టాలపై యువతి హల్‌చల్.. నిలిచిన రైళ్లు



హైదరాబాద్, జూన్ 26: రంగారెడ్డి జిల్లా నాగులపల్లి నుంచి శంకర్‌పల్లి వెళ్లే మార్గంలో రైలు పట్టాలపై కారు నిలిపిన యువతి హల్‌చల్ చేసింది. గమనించిన నాగులపల్లి గ్రామస్థులు.. యువతి నడుపుతున్న కారును అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ కారును రైలు పట్టాలపై వేగంగా నడుపుతూ ఆమె ముందుకు వెళ్లిపోయింది. దీంతో గ్రామస్థులు వెంటనే రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది సమాచారం మేరకు రంగంలోకి దిగిన రైల్వే అధికారులు.. ఆ మార్గంలో ప్రయాణించే రైల్వే పైలెట్లకు సమాచారం అందించారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న రైళ్లను నిలిపివేయగా.. కొన్ని గంటలపాటు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రైలులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు సదరు మహిళపై పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని.. రైలు పట్టాలపై కారు నిలిపిన మహిళను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కారుతోపాటు ఆమెను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమెను పోలీసులు విచారిస్తున్నారు. పట్టాలపై కారు నడిపిన యువతిని రవికా సోనికాగా పోలీసులు గుర్తించారు. ఆమె స్వస్థలం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో అని చెప్పారు. హైదరాబాద్‌లోని ఒక సంస్థలో ఆమె సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తుందన్నారు. కానీ ఇటీవల ఆమెను విధుల నుంచి తొలగించారని పేర్కొన్నారు. నాగులపల్లి– శంకర్‌పల్లి మధ్య సుమారు ఏడు కిలోమీటర్ల మేర రైలు పట్టాలపై ఆమె కారు నడిపిందన్నారు. అయితే ఆమె మద్యం సేవించడం లేదా డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఈ విధంగా వ్యవహరించిందా? లేకుంటే మరేమైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అందుకోసం ఆమెను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే రీల్స్ కోసమే ఆమె ఈ నిర్వాకానికి పాల్పడినట్లు సమాచారం. ఆమె చేసిన ఈ పని కారణంగా.. రెండు గంటలపాటు రైళ్లు ఆ మార్గంలో ఆగిపోయాయని పోలీసులు చెప్పారు.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం:
## బ్లాక్ బాక్స్‌లోని డేటా డౌన్లోడ్




న్యూఢిల్లీ, జూన్ 26: అహ్మదాబాద్‌లో కుప్పకూలి దగ్ధమైన ఎయిర్ ఇండియా విమానానికి సంబంధించిన బ్లాక్ బాక్స్‌తోపాటు కాక్ పిట్ వాయిస్ రికార్డర్‌కు సంబంధించిన డేటా డౌన్లోడ్ ప్రక్రియ ముగిసిందని కేంద్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. ప్రస్తుతం ఆ డేటాను విశ్లేషిస్తున్నామని తెలిపింది. అయితే విమాన ప్రమాదంలో బ్లాక్‌బాక్స్‌తోపాటు కాక్ పిట్ వాయిస్ రికార్డర్‌లు దెబ్బ తిన్నాయి. ఈ నేపథ్యంలో వాటిలోని డేటా బయటకు తీయటం కష్టతరంగా మారింది. దీంతో కేంద్రం వాటిని అమెరికాకు పంపి.. అందులోని డేటాను వెలికి తీసే ప్రయత్నాలను చేపట్టిందంటూ పలు వార్తా కథనాలు వెలువడ్డాయి. కానీ, వాటిలోని మొత్తం డేటాను సురక్షితంగా వెలికి తీయడంలో ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) విజయం సాధించింది. దీంతో ఈ విమాన ప్రమాదానికి గల కారణాలు మరికొన్ని రోజుల్లో ప్రజలకు తెలియనున్నాయి. జూన్ 12వ తేదీ మధ్యాహ్నం అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్‌కు ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయింది. టేకాఫ్ అయిన కొన్ని నిమిషాలకే ఆ విమానం బీజే హాస్టల్‌పై కూలిపోయి.. దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఒకరు మినహా మిగిలిన 241 మంది మరణించారు. విమాన సిబ్బంది 12 మంది మృతి చెందారు. హాస్టల్ భవనంపై విమానం కూలిపోవడంతో 34 మంది విగత జీవులయ్యారు. ఈ ఘటన అనంతరం బ్లాక్ బాక్స్ హాస్టల్ భవనంపై దొరికింది. అలాగే కాక్ పిట్ వాయిస్ రికార్డర్ శిథిలిలా కింద లభ్యమైంది. అయితే ఇవి దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో వీటిలోని డేటాను సురక్షితంగా వెలికి తీయగలమా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అలాంటి వేళ.. వీటిలోని డేటాను ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) వెలికి తీసింది.

# జూలై 13న మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు మహాత్మా గాంధీ చరఖా అవార్డుల ప్రధానోత్సవం






గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సుకు హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న యానాల ప్రభాకర్ రెడ్డి తదితరులు.





హైదరాబాద్, జూన్ 26, (తెలంగాణ దిశ) :గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, వినోబా నగర్ డెవలప్ మెంట్ సొసైటీ, తెలంగాణ స్వర్ణోదయ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 50వ స్వర్ణోత్సవాల ఉత్సవాల సందర్భంగా జూలై 13న మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు, "మహాత్మా చరఖా అవార్డుల ప్రధానోత్సవ" కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు గాంధీ సంస్థ చైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. నాంపల్లి గాంధీభవన్ లోని ప్రకాశం హాల్ లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా గోపూజ, 1500 మహాత్మా గాంధీ (ఒక ఫీట్ ఎత్తు) విగ్రహాల సామూహిక ప్రదర్శన, 156 చరఖాల ప్రదర్శన, 156 మందితో బాల గాంధీల వేషధారణ, గాంధీజీ, ఆచార్య వినోబా భావే ఫోటో గ్యాలరీ, పుస్తక ప్రదర్శన, ఎద్దు గానుగ ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఇంకుడు గుంత ప్రారంభోత్సవం, గాంధీ సుస్థిర విజ్ఞాన (విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, సహజ ఇంధన వనరులు, పర్యావరణం, మత్తు పదార్థాల నిషేధం) తదితర అంశాలపై ప్రదర్శనలు, ప్రముఖుల సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితోపాటు మల్కంబ్, యోగ ప్రదర్శన, ప్రతిభ పాటవ పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం ఉత్సవం, గాంధీయ వాదులకు "మహాత్మా చరఖా అవార్డు"లతో సన్మానోత్సవ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్ స్వర్ణోత్సవాలు, భూధాన్ వజ్రోత్సవాల క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలు, గాంధీయ వాదులు, పర్యావరణ వేత్తలు, యువతి, యువకులు, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# టీచర్ అవతారమెత్తిన అదనపు కలెక్టర్ రాధిక గుప్తా







**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 26, (తెలంగాణ దిశ) :**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తా గురువారం టీచర్ అవతారమెత్తారు. గురువారం షామీర్ పేట్ మండలం తూముకుంట, దేవరయాంజాల్ లలో మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలను, అంగన్ వాడి ఆమె కేంద్రాన్ని సందర్శించారు.తరగతి గదిలో ఆమె విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలు సబ్జెక్టుల నుంచి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు బోధించేటప్పుడు శ్రద్ధగా వినాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఇందు కోసం కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకోవాలని ఆమె సూచించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, నోటు, వర్క్ బుక్స్ పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడి కేంద్రానికి వస్తున్న చిన్నారుల సంఖ్యను ఆరా తీసారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం పిల్లలకు క్రమం తప్పకుండా అందించాలని ఆదేశించారు. గర్భిణీలను గుర్తించి వారికి గుడ్లు, పాలు, పౌష్టికాహారం ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మరమ్మతులను చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే స్కూళ్లలో అదనపు గదులు అందుబాటులో ఉంటే అంగన్‌వాడి కేంద్రాలు ఉపయోగించుకొనేలా వీలు కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నశముక్తి భారత్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తూముకుంట మున్సిపల్ కమీషనర్ వెంకట గోపాల్, డిఇఓ విజయకుమారి, మున్సిపాలటీ డిఇ సునీత, మేడ్చల్ సిడిపిఓ శారద తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా సంఘాలను ప్రోత్సహిస్తాం-తెలంగాణలో చెస్‌కు ఎంతో ఆదరణ

## స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి






హైదరాబాద్, జూన్ 26, (తెలంగాణ దిశ) :క్రీడాభివృద్ధి దోహదపడుతూ వివిధ కార్యక్రమాలను నిర్వహించే క్రీడా సంఘాలను ప్రోత్సహిస్తామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. గురువారం ఎల్ బి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా ఫిడే ర్యాంకింగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తున్న వివిధ క్రీడా సంఘాలు చేపట్టే కార్యక్రమాలను స్పోర్ట్స్ అథారిటీ ప్రోత్సహిస్తుందని తెలిపారు. వివిధ క్రీడా సంఘాలు నిర్వహించే క్రీడా పోటీలు ఔత్సాహిక క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావ దానికి ఎంతో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. తెలంగాణ చెస్ అసోసియేషన్ నిర్విరామంగా ఎన్నో టోర్నమెంట్లు నిర్వహిస్తూ ఎంతోమంది క్రీడ చెస్ క్రీడాకారులను వెలుగులోకి తెస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ తో కలిసి చెస్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత అనూప్ కుమార్ యామ, స్వాన్ ఎన్విరాన్ మెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చదలవాడ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. చెస్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి జయచంద్ర, కోశాధికారి పుణ్యవతి, ఉపాధ్యక్షులు జనార్ధన్, సంయుక్త కార్యదర్శి బసవ ప్రభు, కృష్ణారెడ్డి ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్( చెస్ ఇన్ స్కూల్స్ )చైర్మన్ కేన్ ప్రసాద్ చీఫ్ ఆర్బిటర్ ఆర్. చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 556 మంది చెస్ క్రీడాకారులు పాల్గొంటుండగా ఇందులో 300 మంది అంతర్జాతీయ రేటింగ్ మరియు ఇద్దరూ అంతర్జాతీయ మాస్టర్ చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.





కాప్రాలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయ మండపంలో సరైన విద్యుత్ దీపాల వెలుతురు లేకపోవడంతో భక్తుల సౌకర్యార్థం ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో నూతన విద్యుత్ వైరింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు పనులను చేపట్టారు. ధర్మకర్తల మండలి సభ్యులు పబ్బతి నరేందర్ గౌడ్, ఉప్పల వినోద్ కుమార్ విద్యుత్ దీపాల పనులను గురువారం పర్యవేక్షించారు. **(కాప్రా, తెలంగాణ దిశ)**

# భవిష్యత్తు బాగుండాలంటే మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దు..,

## బివిఆర్ ఐటి కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల పట్ల అవగాహన





కుత్బుల్లాపూర్, జూన్ 26, (తెలంగాణ దిశ) : భవిష్యత్తు బాగుండాలంటే మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని బాచుపల్లి పోలీసులు గురువారం స్థానిక బివిఆర్ ఐటి కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో పేర్కొన్నారు ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం యొక్క హానికర ప్రభావాలు, నివారణ వ్యూహాలు, హెల్ప్ లైన్ సమాచారాన్ని ప్రధాన అంశాలుగా చేస్తూ విద్యార్థులకు పోలీసులు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు ఆసక్తిగా, చురుకుగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం పట్ల అవగాహన కల్పించేందుకు ప్ల కార్డులను ప్రదర్శించారు. అనంతరం పోలీసులు విద్యార్థులను ఉద్దేశించి మాదక ద్రవ్య రహిత సమాజానికి అంబాసిడర్లుగా విద్యార్థులు వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో బాచుపల్లి ఇన్ స్పెక్టర్ ఉపేందర్, పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, బివిఆర్ ఐటి కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరం

## మందుముల పరమేశ్వర్‌రెడ్డి





**ఉప్పల్, జూన్ 26, (తెలంగాణ దిశ) :**సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరంగా మారిందని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ కూడా సీఎంఆర్ఎఫ్ కింద మెడికల్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నట్టుగా తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం పరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎలిమేటి ప్రమీల రూ.60 వేలు, భవాని రూ. 60 వేలు, బిక్షపతి రూ.55 వేలు, శైలజ రూ.45 వేలు,మోహన్ క్రాంతి రూ.60 వేలు, శాంతమ్మ రూ. 60 వేలు, ఎండి.సాధిక్ రూ. 60 వేల చొప్పున మంజూరైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందచేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్, మీర్ పేట్, హెచ్ బి కాలనీ డివిజన్ అధ్యక్షులు పోలేపాక అంజయ్య, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు సాయి కిరణ్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొంపల్లి బాలరాజు, అల్లూరయ్య, విట్టల్ నాయక్, పసుల లుకాస్,శ్రీకాంత్ రెడ్డి, కోయలకొండ రాజేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారం అరుణ్, సల్ల ప్రభాకర్ రెడ్డి, కిషోర్, వంశీ, సర్ఫరాజ్, ముత్యాల నరేష్, రఘు, సురేష్ గుప్త, వెంకట్ గౌడ్, సురేశ్ గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# నేడు దమ్మాయిగూడలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగే ప్రాంతాలు




**దమ్మాయిగూడ, జూన్ 26, (తెలంగాణ దిశ) :** చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం దమ్మాయిగూడలోని పలు కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్తు శాఖ దమ్మాయిగూడ అసిస్టెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9:00 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాకెట్ సబ్‌స్టేషన్, దమ్మాయిగూడ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ కారణంగా అంజనాద్రి కాలనీ, అంజనాద్రి ఎక్స్ టెన్షన్, ఎంఎల్ఆర్ కాలనీ, వివిఎస్ హెూమ్స్, హరి హరా ఎన్ క్లేవ్, సిఎన్ఆర్ కాలనీ, సాయి ప్రసన్న ఎన్ క్లేవ్, ఇందిరమ్మ కాలనీ, సత్యనారాయణ కాలనీ, కార్మిక నగర్, దమ్మాయిగూడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు చక్రిపురం సబ్‌స్టేషన్, అయప్పకాలనీ ఫీడర్ పరిధిలోని శశాంక్ ఎన్ క్లేవ్, భవానీ నగర్, గాయత్రి నగర్, బాలాజీ నగర్, బాలాజీ నగర్ పిహెచ్ –2, కృష్ణ థియేటర్ రోడ్, ఆర్‌సి ఎన్‌క్లేవ్, శ్రీ లక్ష్మి నగర్, దుబాయ్ భవనం, నాగారం నుండి దమ్మాయిగూడ ప్రధాన రహదారి, సాయి లోక్ కాలనీలలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.





దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు కాలనీల ప్రజలకు వర్షాకాలంలో వచ్చే డెంగ్యూ, మలేరియా వ్యాధుల గురించి గురువారం అవగాహన కల్పించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరు చేసి చెత్త రిక్షాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, శానిటేషన్ సూపర్ వైజర్ కె. ప్రభు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. **(దమ్మాయిగూడ, తెలంగాణ దిశ)**

# సంపాదకీయం

## మాంద్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగం 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత తగ్గిందన్నది నిస్సందేహం. అమెరికాలోని కొందరు మితవాద ఆర్థికవేత్తలు సైతం 'ఇది దీర్ఘకాలిక మాంద్యం' అంటున్నారు (ఆ పదానికి వారిచ్చే నిర్వచనం వింతగా ఉంటుంది). ఈ అంశాన్ని కొన్ని గణాంకాల ద్వారా వివరించడం ఈ వ్యాసం ఉద్దేశం. జిడిపి ని (స్థూల జాతీయో త్పత్తి) లెక్కించే విధా నాలు ఆ యా దేశాల్లో చాలా వరకూ విశ్వసనీయత కలిగినవి కావు. ఇక మొత్తం ప్రపంచానికి సంబంధించి ప్రత్యేకంగా చెప్పనవసరమే లేదు. భారత దేశంలో అధికారిక లెక్కలను అనేకమంది పరిశోధకులు ప్రశ్నిస్తున్నారు. అధికారులేమో 7 శాతం, ఆ పైబడి వృద్ధిరేటు ఉన్నట్టు చూపుతున్నారు. కాని ఈ పరిశోధకులు అది 4 శాతం నుండి 4.5 శాతానికి మించదని, ఈ పరిస్థితి గత కొన్ని సంవత్సరాలుగా ఇదే మాదిరిగా ఉంటోందని గట్టిగా చెప్తున్నారు. ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ కొనసాగిన గత కాలంతో పోల్చి నయా ఉదారవాద విధానాల కాలంలో జిడిపి వృద్ధిరేటు గురించి చంకలు గుద్దుకోవడం అర్థం లేనిది. గత కాలంతో పోల్చితే వృద్ధిరేటు పెరిగింది పెద్దగా లేదు. పైగా అసమానతలు బాగా పెరిగిపోతున్నాయి. పోషకాహార లభ్యత గురించి లభిస్తున్న గణాంకాలను బట్టి శ్రామిక ప్రజానీకపు స్థితిగతులు బాగా క్షీణించాయని స్పష్టంగా చెప్పవచ్చు. అంత నిలకడ లేని ఈ జిడిపి గణాంకాలను పక్కనపెట్టి ప్రపంచ జిడిపి సంగతేమిటో చూద్దాం. ఇందుకోసం నేను ప్రపంచబ్యాంక్ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటున్నాను. 2015 నాటి ధరలు ఆ యా దేశాల్లో ఎలా ఉన్నాయో, పరిశీలించి, వాటిని 2015 నాటి డాలర్‌తో ఆ యా దేశాల కరెన్సీ మారకపు రేటును లెక్కలోకి తీసుకుని ఆ ప్రాతిపదికన జిడిపి లెక్కలను అంచనా కట్టారు. 1961 నుంచీ గడిచిన కాలాన్ని కొన్ని ఉప కాలాలుగా విభజించి ఆ యా ఉప కాలాలలో వృద్ధి ఏ విధంగా ఉన్నదీ పరిశీలించడం కొంచెం చిక్కులతో కూడుకున్న విషయమే. ఒక దశాబ్ద కాలాన్ని ఒక ఉప కాలంగా విభ జిస్తే గనుక దానిలో ఒక సమస్య వస్తుంది. ఆ దశాబ్దపు మొదటి ఏడాది గనుక వృద్ధి రేటు బాగా తక్కువగా ఉంటే, దాంతో పోల్చినప్పుడు తక్కిన దశాబ్దకాలం యావత్తూ వృద్ధిరేటు చాలా ఎక్కువగా జరిగినట్టు లెక్క వస్తుంది. అందుచేత సరైన అంచనాలకు రావడానికి వీలుగా నేను 1961 నుంచీ గడిచిన కాలంలో బాగా ఎక్కువ వృద్ధిరేటు సాధించిన సంవత్సరాలను ఎంచుకున్నాను. ఆ విధంగా చూసినప్పుడు 1961, 1973, 1984, 1997, 2007, 2018 సంవత్సరాలలో అత్యధిక వృద్ధిరేటు జరిగినట్టు తేలింది. ఇప్పుడు వీటిలో ప్రతీ రెండింటి మధ్య కాలంలోని వృద్ధిరేటును పరిశీలించాను. ఆ రేట్లు ఈ విధంగా (పట్టిక) ఉన్నాయి.పట్టికలోని అంకెలను బట్టి మూడు నిర్ధారణలు చేయవచ్చు. మొదటిది: మొత్తంమీద చూసినప్పుడు ప్రభుత్వాల నియం త్రణలో దేశాల ఆర్థిక వ్యవస్థలు నడిచినప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు నయా ఉదారవాద కాలంలోని వృద్ధిరేటు కన్నా చాలా ఎక్కువగా ఉంది. "మార్కెట్టే సర్వ శక్తి సంపన్నం" అంటూ ఇప్పుడు జరుగుతున్న చర్చల్లో నయా ఉ దారవాద కాలంలోనే జిడిపి వృద్ధిరేటు బాగా ఎక్కువగా ఉందన్న అభిప్రాయం కలుగుతుంది. ఈ అభిప్రాయం పూర్తిగా తప్పు. వాస్తవానికి నయా ఉదారవాద కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు గణనీయంగా మందగించింది.రెండవది: ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థలు నడిచిన కాలానికి, నయా ఉదారవాద విధానాలు అమలు కావడం మొదలైన నాటికి మధ్య కొంత వ్యవధి ఉంది. ఈ కాలంలో వృద్ధిరేటు 5.4 శాతం నుండి 2.9 శాతానికి పడిపోయింది. 1967 నుండి ద్రవ్యోల్బణం వేగవంతం అయి 1973-74 వరకూ కొనసాగింది. దానిని అదుపు చేయడానికి పెట్టుబడిదారీ వర్గం ప్రభుత్వ వ్యయాన్ని కుదిస్తూ, భారీ స్థాయిలో నిరుద్యోగాన్ని పెంచే వ్యూహాన్ని అనుసరించింది. ఈ వ్యూహం ఫలితంగా 1973 నుంచీ వృద్ధిరేటు మందగించింది. అప్పటి నుంచీ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద ప్రభుత్వాల నియంత్రణ ఉండే విధానం నిలిచిపో యింది. ఇలా వృద్ధిరేటు మందగించిపోవడం నయా ఉదారవాద విధానాలను ప్రవే శపెట్టడానికి కావలసిన భూమికను కల్పించింది. అప్పటికే పెరుగుతూ అంతకంతకూ అంతర్జాతీయ స్వభావాన్ని సంతరిం చుకుంటున్న ద్రవ్య పెట్టుబడి అంతకు ముందునుంచే నయా ఉదారవాద విధానాలకు మళ్ళాల్సిందేనంటూ ఒత్తిడి పెంచుతోంది. సరిగ్గా ఆ సమయానికే పాత విధానాల పర్యవసానంగా ముందు ద్రవ్యోల్బణం, తర్వాత వృద్ధిరేటు మందగించడం జరిగాయి. మూడవది: పైన ఇచ్చిన అంకెలను చూస్తే అమెరికాలో హౌసింగ్ బుడగ పేలిపోయిన అనంతర కాలంలో వృద్ధిరేటు మందగమనం కొనసాగుతూనే వుంది. హౌసింగ్ బుడగ బద్దలైపోవడంతో పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా సంక్షోభం లో పడింది. అప్పుడు ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున జోక్యం చేసుకుంది (ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వాల జోక్యం ఉండరాదనే నయా ఉదారవాదం బండారం దీనితో బైటపడింది). కాని వాస్తవ ఆర్థిక వ్యవస్థకు దాని నుంచి ఎటువంటి ప్రేరణా లభించలేదు. వృద్ధిరేటును పెంచడానికి ప్రభుత్వాల వ్యయం పెరగడం గాని, హౌసింగ్ బుడగ వంటి మరేవైనా బుడగలు ఏర్పడి తాత్కాలికంగా వృద్ధిరేటు వేగాన్ని పెంచడానికి దోహదం చేయడం వంటివి కాని జరగలేదు. మనం 2018 సంవత్సరాన్ని ఆఖరి గరిష్ట వృద్ధి సంవత్స రంగా తీసుకున్నాం. ఆ తర్వాత చూస్తే వృద్ధిరేటు మరీ అన్యాయంగా పడిపోయింది. 2018 నుంచి 2022 మధ్య వృద్ధిరేటు సాలుకు 2.1 శాతం మాత్రమే ఉంది. ప్రపంచ జనాభా వృద్ధిరేటు సుమారు 1 శా తంగా ఉంది (మన దేశ జనాభా లెక్కలు 2021లో సేకరించి వుండా ల్సింది. కాని ఇంతవరకూ ఆ పని ప్రారంభం కానేలేదు.). దీనిని పరిగణనలోకి తీసుకుంటే ప్రపంచ తలసరి ఆదాయం ఒక శాతం చొప్పున మాత్రమే పెరుగుతున్నట్టు భావించాలి. ఐతే, ప్రపంచంలో ఆదాయాల మధ్య అసమానతలు బాగా పెరుగుతున్నాయి. దానిని బట్టి ప్రపంచ జనాభాలో అత్యధిక మెజారిటీ ఆదాయాలలో పెరుగుదల లేకుండా స్తంభించిపోవడం కాని తరిగిపోవడం కాని జరుగుతోంది. దీనిని వివరించడానికి దిగువ విషయాన్ని ఉదహరిస్తాను. ప్రపంచ ఆదాయం మొత్తంలో సగభాగం కన్నా ఎక్కువ జనాభాలోని అత్యంత సంపన్నులైన 10 శాతం ప్రజలు పొందుతున్నారు. వీరి ఆదాయాలు ఏటా కనీసం 2 శాతం చొప్పున పెరుగుతున్నాయనుకుంటే అప్పుడు తక్కిన 90 శాతం మంది ఆదాయాలూ ఏ పెరుగుదలా లేకుండా స్తంభించిపోయినట్టే కదా. అంటే నయా ఉదారవాదం చివరి దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ జనాభాలో అత్యధిక ప్రజానీకపు ఆదాయాలు పెరుగుదల లేకుండా స్తంభించిపోయేట్టు చేసిందని స్పష్టం అవుతోంది. ఇది పాత వలస పాలనా కాలాన్ని గుర్తుకు తెస్తోంది. అప్పుడు కూడా ప్రపంచంలోని అత్యధిక శాతం ప్రజల నిజ ఆదాయాలు పెరగకపోగా తరిగిపోయాయి. ఇలా వృద్ధిరేటు మందగించడం అనేది కొద్ది కాలంపాటు మాత్రమే ఉండే తాత్కాలిక సమస్య అని, త్వరలోనే దీనిని అధిగమిస్తామని అనుకోలేం. ఈ పరిస్థితి నయా ఉదారవాద విధానాల పర్యవసానమే. ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు పెరగాలంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరగాలి.

## యాచక రహిత నగరానికి

# జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్





**హైదరాబాద్, జూన్ 26, (తెలంగాణ దిశ) :** గ్రేటర్ హైదరాబాద్ లో పలు ప్రధాన కూడళ్ళలో ఇబ్బందులు కలిగిస్తున్న యాచకులను గుర్తించి షెల్టర్ హెూమ్ లకు లేదా సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించే కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ చేపట్టింది. జీహెచ్ఎంసీ కమీషనర్ ఆదేశాలమేరకు ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో, ప్రధానంగా బషీర్ బాగ్, సెక్రెటరియేట్, నాంపల్లి, బేగంబజార్ తదితర ప్రాంతాల్లో జంక్షన్ల వద్ద ఉండే యాచకులు, ఫుట్ పాత్ లపై ఉండే వారిని గుర్తించి జీహెచ్ఎంసీ నిర్వహించే షెల్టర్ హెూమ్ లకు తరలిస్తున్నారు. మిగిలిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వారిని తమ స్వంత ఊర్లకు, నివాసాలకు పంపిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో గత రెండు, మూడు రోజులుగా ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, మతపరమైన ప్రదేశాలలో భిక్షాటన చేసే వారి గురించి సమాచారం అందుకొని, వారిని వైద్య పరీక్షల తర్వాత పోలీసుల సహకారంతో జీహెచ్ఎంసీ షెల్టర్ హెూమ్స్‌కు తరలించే ఏర్పాటు చేస్తున్నారు. ఈ కొద్ది రోజులుగా యుసిడి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ యాచకుల తరలింపులో 221 మందిని గుర్తించారు. వీరిలో 173 మంది పురుషులు, 37 మంది స్త్రీలు, 11 పిల్లలున్నారని గుర్తించారు. వీరిలో 19 మందిని జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న షెల్టర్ హెూమ్ కు తరలించగా, మిగిలిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారి వారి కుటుంబ సభ్యుల వద్దకు పంపించారు. యాచకులు, ఫుట్ పాత్ లపై ఉండేవారిని షెల్టర్ హెూమ్ లకు లేదా వారి కుటుంబ సభ్యుల వద్దకు తరలించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఇందు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని జీహెచ్ఎంసీ యుసిడి అధికారులు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ :కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూన్ 26, (తెలంగాణ దిశ) :** అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలను హనుమంత రెడ్డి అందజేశారు. బాచుపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమం లో చెక్కుల పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 129 వ డివిజన్ సూరారంకు చెందిన కె. సయమ్మకు 60 వేలు, తొండం పోచమ్మకు 30 వేలు, 130 డివిజన్ సుభాష్ నగర్ కు చెందిన ఎర్రవెల్లి సంజీవరెడ్డికి 60 వేలు, సోమన్నగారి సాకేత్ రెడ్డికి 29 వేలు, కొంపల్లి మున్సిపాలిటీ వంకాయల కమలాదేవికి 25 వేలు, 128 డివిజన్ వల్లభాయ్ పటేల్ నగర్ వాసుకి 60 వేలు మంజూరీ పత్రాలను, చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఇంచార్జీ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు ద్వారా సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి మంజూరు చేయించినట్లు తెలిపారు. నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకునే వారు ఈ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం పొందవచ్చు అని, అర్హులైన వారందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అవిజే జేమ్స్, మాజీ కార్పొరేటర్ బాలకృష్ణ, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు బేకు శ్రీనివాస్, పండరి రావు, సంతోష్ ముదిరాజ్, ఎండి లాయక్, ఎండి అంజాద్, సయ్యద్ షఫీ, ఎండి గఫార్, అజయ్, తులసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లను తక్షణమే జారీ చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి





**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 26, (తెలంగాణ దిశ) :** వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెను వెంటనే జారీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కుత్బుల్లాపూర్ మండల పరిధిలో పర్యటించారు. తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మింకగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం మీ- సేవా ద్వారా చేసుకున్న పెండింగ్ దరఖాస్తులను, రెవెన్యూ రికార్డులను, రిజిష్టర్లను ఆయన పరిశీలించారు. ప్రజల అవసరాల దృష్టిలో పెట్టుకొని కులం, లోకల్ (స్థానికత) సర్టిఫికెట్లు, ఆదాయం ఇతరాత్ర సర్టిఫికెట్ల జారీ నిమిత్తం చేసు కున్న దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అని పరిశీలించి, నిర్దేశించిన సమయంలోపు జారీ చేయాలని ఆదేశించారు. సర్టిఫికెట్ల ఇచ్చే ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పరిపాలన పరమైన ఫైళ్ళను పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే మండలంలోని గాజులరామారంలోని సర్వే నెంబర్ 307, 342 గల ప్రభుత్వ భూములు, అందుకు సంబందించిన మ్యాపులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. భూమి హద్దులు, భూమి యొక్క పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఆర్‌డి ఓ. శ్యామ్‌ప్రసాద్, ఇంచార్జీ తహశీల్దార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సుభాష్ చంద్రబోస్ నగర్ - ఎ లో

# మంజూరైన సీసీ రోడ్ల బస్తీల పరిశీలన



### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, జూన్ 26, (తెలంగాణ దిశ) :** గాజులరామారం, సుభాష్ చంద్రబోస్ నగర్ - ఎ లో కాలనీ వాసుల విన్నపం మేరకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గణేష్ టెంపుల్ నుంచి చిల్లా వరకు, బస్వరాజ్ ఇంటి నుంచి చాన్ ఇంటి వరకు, శ్రీను ఇంటి నుంచి చిల్లా వరకు, ట్రాన్స్ ఫార్మర్ నుండి చంద్రగిరి బార్డర్ వరకు రూ. 38 లక్షలతో సీసీ రోడ్లు మంజూరైనందున ఆయా బస్తీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి కాలనీ వాసులు రోడ్ల సమస్యతో ఇబ్బంది పడిన ఎ నాయకుడు పట్టించుకునే పాపానపోలేదని అన్నారు. ఈ సమస్య తన దృష్టికి రాగానే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బలరాం, జహంగీర్ భాయ్, పద్మా,గుమస్తా మధు, అభేద్, గట్టయ్య, డేవిడ్ రాజు, నాగరాజు, జర్జ్, రఘువీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నేడు నాగారంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం




**నాగారం, జూన్ 26, (తెలంగాణ దిశ) :** విద్యుత్తు లైన్ల పైన ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం కోసం పలు విద్యుత్ ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని నాగారం అసిస్టెంట్ ఇంజనీర్ ఎ. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు ఇందులో భాగంగా 11 కెవి బాబు రెడ్డి నగర్ కాలనీ ఫీడర్ 33/11 కెవి చక్రిపురం నుండి 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కారణంగా శిల్పా నగర్, న్యూ మోడీ అపార్ట్ మెంట్, లావణ్య ఎన్ క్లేవ్, ప్రగాథి ఎన్ క్లేవ్, చక్రరు ఎన్ క్లేవ్, బాబు రెడ్డి కాలనీ, లక్ష్మి నగర్, అన్నమయ్య కాలనీ, శివ సాయి ఎన్ క్లేవ్, ఎస్సీ కాలనీ, బిబిసి కాలనీ, భగ్యా నగర్ కాలనీ, సాయి మలికార్జున నగర్ లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అదే విధంగా 11 కెవి సాయి బాబా టెంపుల్ ఫీడర్ 33/11 కెవి నాగారం ఉప-స్టేషన్ నుండి 2 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా సాయి బాబా కాలనీ, తూర్పు గాంధీ నగర్, ప్రశాంత్ నగర్, సాయి ధరణి కాలనీ, రాజ్ సుఖ్ నగర్, సాయి మహీమా కాలనీ, నేతాజీ నగర్, హనుమకోండ కాలనీ, తూర్పు హనుమన్ నగర్, అన్నపూర్ణ కాలనీ, గోవారి ఎన్ క్లేవ్, వన్ కాలనీ, గోవారి ఎన్ క్లేవ్, వన్ కాలనీ 3 లలో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## బోనాల పండుగ సందర్భంగా గతంలో కన్నా ఎక్కువ నిధులు మంజూరు చేయాలి



**ఉప్పల్, జూన్ 26, (తెలంగాణ దిశ) :** బోనాల పండుగ సందర్భంగా గతంలో కన్నా ఎక్కువ నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ నాయకులు తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి సురేఖను శుక్రవారం కలిసి కోరారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని దేవాలయాలకు బోనాల పండుగ సందర్భంగా గతంలో కన్నా ఎక్కువ నిధులు మంజూరు చేయాలని అదే విధంగా కొన్ని కొత్త దేవాలయాలకు కూడా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, నాయకులు గద్దం రవికుమార్, తవిడబోయిన గిరిబాబు, కాంగ్రెస్ పార్టీ రామంతపూర్ ఇంచార్జీ సుర్వి మురళి గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ప్రధాన కార్యదర్శి వినోద్ ముదిరాజ్, మాజీ ఎవైసీసీ నేషనల్ కో ఆర్డినేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బరంపేట కృష్ణ, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ అవకాశాలకు డీట్ లో అర్హులైన యువత నమోదు చేసుకోవాలి




**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 26, (తెలంగాణ దిశ) :** నైపుణ్య వంతులైన నిరక్షరాస్యుల నుండి ఎం.ఫిల్, పిహెచ్ డి వరకు విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు ప్రయివేట్ రంగంలో ఉద్యోగ అవకాశాల కోసం డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ (డీట్)లో క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి ఆర్థిక పరంగా ఎదుగుదలకు దోహపడాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ను రూపొందించిందని అన్నారు. దివ్యాంగులతో సహా అన్ని సామాజిక వర్గాల యువత నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. తద్వారా నిరుద్యోగులకు అర్హత మేరకు ఉద్యోగాలను సులభంగా పొందేందుకు సహాయ పడుతుందన్నారు. అన్ని రంగాల్లో కలిపి సుమారు 8 వేల 443 లు పైనే ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో ఫుల్‌టైమ్, పార్ట్ టైమ్, వర్క్ ఫ్రమ్ హెూమ్ ఉద్యోగాలు కూడా పొందవచ్చునని పపొందవచ్చునని ఆయన తెలిపారు. ఆసక్తి, అర్హతగల వ్యక్తులు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా పరిశ్రమ శాఖ అధికారులను, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. డీట్.తెలంగాణ.గవర్నమెంట్. డాట్. ఇన్ లేదా 92814 23575, 92814 23576, 92814 23577, 92814 23578, 92814 23579 నెంబర్లలో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.



# ఈ ఆహారాలను తీసుకుంటే
# మీ శరీరంలో క్రిములు అసలు ఉండవు..!

మన శరీర రోగ నిరోధక వ్యవస్థ నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటుంది. శరీరంలోకి చేరే క్రిములను ఎప్పటికప్పుడు నాశనం చేస్తుంది. అయితే రోగ నిరోధక వ్యవస్థ పనితీరు సరిగ్గా లేనివారు, ఇమ్యూనిటీ తక్కువా ఉన్నవారు తరచూ రోగాల బారిన పడుతుంటా రు. ఎందుకంటే క్రిములు శరీరంలోకి ప్రవేశించిన తరువాత రోగ నిరోధక శక్తి కణాలు సరిగ్గా పనిచేయవు. లేదా కణాలు తగిన సంఖ్యలో ఉండవు. దీంతో శరీరం ఇన్ఫెక్షన్ లేదా రోగానికి వ్యతిరేకం గా పోరాడలేకపోతుంది. దీని వల్ల వ్యాధి తీవ్రత ఎక్కువవుతుంది. అయితే రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటే ఎలాంటి రోగాలు రావు. క్రిములు మన శరీరంలోకి చేరగానే వెంటనే రోగ నిరోధక వ్యవస్థ చంపేస్తుంది. కనుక క్రిములను చంపేందుకు గాను ఇమ్యూనిటీని పెంచే ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది.

**నిమ్మకాయ..:** నిమ్మకాయలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. నిమ్మకాయలో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఉదయం నిమ్మకాయ నీళ్లను తాగితే శరీరంలోని వ్యర్థాలు బయటకు పోతాయి. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. నిమ్మరసం తాగడం వల్ల మన శరీరంలోకి క్రిములు చేరగానే వెంటనే రోగ నిరోధక వ్యవస్థ యాక్టివేట్ అయి క్రిములను చంపేస్తుంది. దీంతో రోగాలు రాకుండా ఉంటాయి. అందువల్ల రోజూ నిమ్మరసం తాగాలి. లవంగాల్లో యూజినాల్ అనే సమ్మేళణం ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది.

**లవంగాలు..:** లవంగాలను మనం తరచూ మసాలా వంటల్లో వేస్తుంటాం. ఇవి ఇన్ఫెక్షన్లు రాకుండా రక్షిస్తాయి. ముఖ్యంగా లవంగాలను తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, వాపులు, మంట ఉండవు. బాక్టీరియా, వైరస్‌లకు వ్యతిరేకంగా పోరాడడంలో లవంగాలు అద్భుతంగా పనిచేస్తాయి. అందువల్ల రోజూ లవంగాలను కూడా తింటుండాలి. పసుపులో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. దీన్ని మనం రోజూ వంటల్లో వేస్తూనే ఉంటాం. పసుపును పాలలో కలిపి తాగితే బాక్టీరియా, వైరస్ ల నుంచి రక్షణ లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలోని వాపులు తగ్గిపోతాయి.

**వెల్లుల్లి..:** వెల్లుల్లిలో ఆల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది సహజసిద్ధమైన యాంటీ బయోటిక్‌లా పనిచేస్తుంది. బ్యాక్టీరియా, వైరస్‌లను ఇది నాశనం చేస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో దగ్గు, జలుబు, ఇన్‌ఫెక్షన్లు రావు. అల్లంలో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉ ంటాయి. అందువల్ల అల్లం రసాన్ని తాగితే శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. గొంతు నొప్పి, మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. మీరు రోజూ తీసుకునే ఆహారంలో అల్లంను ఎలా అయినా తీసుకోవచ్చు. దీని వల్ల జలుబు నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. అల్లంను తీసుకుంటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. అలాగే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రోగాల బారి నుంచి రక్షణ లభిస్తుంది. **తులసి..:** ఆయుర్వేదంలో తులసికి ఎంతో ప్రాధాన్యతను కల్పించారు. ఇందులో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల తులసి ఆకులతో తయారు చేసిన టీని తాగాలి. దీంతో ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. జ్వరం తగ్గుతుంది. రోగ నిరోధక శక్తి పరుగుతుంది. దగ్గు, జలుబును తగ్గించడంలో తులసి ఆకులు అద్భుతంగా పనిచేస్తాయి. తేనెలో సహజసిద్ధమైన యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. తేనెను ఎంతో పురాతన కాలం నుంచే ఔషధంగా ఉ పయోగిస్తున్నారు. తేనెను తీసుకోవడం వల్ల గొంతు నొప్పి నుంచి ఉ పశమనం లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. గాయాలపై తేనెను రాస్తే అవి త్వరగా మానుతాయి. ఇలా పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకోవచ్చు. దీంతో సీజనల్ వ్యాధులు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది.

## హైవే ఐడియా భలే ..!



చైనా : హైవేలు, రోడ్లు వేసేటప్పుడు రైతన్నలు తమ పొలాలను, చెరువులను నష్టపోతుంటారు..! ఇలా.. హైవేలు, రోడ్ల రూపంలో ఎన్నో పొలాలు, చెరువులు అంతరించిపోయాయి..! అయితే రైతుల పొలాలకు కానీ, చెరువులకు కానీ ఎలాంటి నష్టం కలగకుండా, ఆధునిక టెక్నాలజీతో చైనాలో సరికొత్త హైవేని నిర్మించారు. హుబ్బే ప్రావిన్స్‌లోని 126 కిలోమీటర్ల పొడవైన వుహాన్– యాంగ్‌షిన్ హైవేను చైనా నిర్మించింది. ఆ బ్రిడ్జి మొత్తం పంట పొలాలూ చేపల చెరువుల మీదుగా సాగుతుంది. అయితే నేలపైన పంటలకు కానీ, చెరువులకు కానీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎత్తయిన స్తంభాలు కట్టి, వాటి మీద ప్రత్యేకంగా నిర్మించిన ఈ హైవే ఐడియా– నిజంగా అద్భుతమే కదా ! అన్నదాతలకు నష్టం లేదు.. ప్రయాణాలకు ఇబ్బందీ లేదు..!

## విజయసాయిరెడ్డి ప్రకటన బాధాకరం

పిఠాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచీ ఉన్న పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పార్టీ నుండి బయటికి రావడం,రాజకీయాల నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం చాలా బాధాకరమైన విషయమని వైఎస్సార్సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్ఛార్జ్ వంగా గీతావిశ్వనాథ్ ఆవేదన వ్యక్తంచేశారు.పిఠాపురం మహారాజాకోట ఆవరణలో గల వైఎస్సార్సీపీ కార్యాలయంలో వంగా గీతావిశ్వనాథ్ మీడియాతో మాట్లాడారు.కాగా.,వైఎస్సార్సీపీ పిఠాపురం పట్టణ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన రావుల మాధవరావును ఆ పార్టీ మహిళా విభాగం కాకినాడ జిల్లా అధ్యక్షురాలు,పిఠాపురం మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ వర్ధినీడి సుజాత ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు ఘనంగా సన్మానించారు..

## తరచూ వాల్‌నట్స్ తింటే ఆ క్యాన్సర్‌లు మీ దరిదాపుల్లోకే రావు..!



బాగా ఖరీదైన వాల్ నట్స్‌ను ఒకప్పుడు బాగా డబ్బులు ఉన్నవారు మాత్రమే తినేవారు. అందుకే ఖరీదైన పంట కావడం, డిమాండ్ తక్కువగా ఉండటం కారణంగా చాలా తక్కువగా వాల్ నట్స్‌ను సాగుచేసే వారు. అయితే వాల్ నట్స్‌తో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిసిన తర్వాత వీటికి డిమాండ్ పెరిగింది. మధ్యతరగతి ప్రజలు కూడా వాల్‌నట్స్‌ను తమ ఆహారంలో బాగం చేసుకుంటున్నారు. దాంతో విదేశాల్లో ఉత్పత్తి అయ్యే టాప్–10 వ్యవసాయ ఉత్పత్తుల్లో వాల్‌నట్స్ కూడా చేరాయి. మరి వాల్‌నట్స్‌తో ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం..

**గుండెకు:** వాల్‌నట్స్‌లో ఆల్ఫా–లినోలెనిక్ యాసిడ్, ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి శరీరంలో వాపును తగ్గించడంలో కీలకంగా పనిచేస్తాయి. నిజానికి ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండే గింజల్లో వాల్‌నట్స్ కూడా ఒకటి. వీటిలో ఉండే ప్రత్యేక గుణాలు గుండెజబ్బుల నుంచి రక్షణనిస్తాయి.

**మెదడుకు:** వాల్‌నట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయని వృద్ధాప్యంతో వచ్చే మానసిక క్షీణతను నెమ్మదించేలా చేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇవి మీ జ్ఞాపకశక్తిని పెంచడంలో కూడా కీలకపాత్ర పోషిస్తాయి.

**గట్ ఆరోగ్యం:** మీ పేగులు, పేగులలోని బ్యాక్టీరియా సూక్ష్మజీవులు కూడా మీరు ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతో అవసరం. వాల్‌నట్‌లు పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. క్లినికల్ ట్రయల్స్‌లోనూ ఇదే విషయం వెల్లడైంది. ప్రతిరోజూ వాల్‌నట్స్‌ను తినేవారు ఆరోగ్యకరమైన గట్ బ్యాక్టీరియాను కలిగి ఉన్నారని అధ్యయనాలు తెలుపుతున్నాయి.

**క్యాన్సర్ నివారణ:** మీ గట్‌లోని సూక్ష్మజీవులు వాల్‌నట్‌లలో ఉ ండే సమ్మేళనాలను తీసుకుంటాయి. తర్వాత యురోలిథిన్ సమ్మేళనాలను ఉత్పత్తి చేస్తాయి. ఈ యురోలిథిన్ సమ్మేళనాలు కొన్ని క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గించడంలో సాయపడతాయి. క్యాన్సర్‌ల నివారణలో వాల్‌నట్‌ల పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి.

**ఆకలి తగ్గడం:** వాల్‌నట్స్‌లో క్యాలరీలు ఎక్కువగా ఉన్నప్పటికీ వాటిలో పోషకాలు కూడా అధికంగా ఉంటాయి. వాల్‌నట్స్‌లోని ఆరోగ్యకరమైన అన్‌సాచురేటెడ్ కొవ్వులు మిమ్మలను ఎక్కువసేపు కడుపు నిండుగా ఉండేలా చేస్తాయి. ఒక ఔన్స్ వాల్‌నట్స్‌లో 190 కేలరీలు ఉన్నప్పటికీ, కేవలం 145 మాత్రమే ఉ పయోగపడతాయని ఒక అధ్యయనంతో తేలింది. వాల్‌నట్‌లు మనకు అవసరమైన ఐరన్, మెగ్నీషియంను కూడా అందిస్తాయి.

## చలికాలంలో రోజూ ముల్లంగిని తింటే ఏం జరుగుతుందో తెలుసా..?

రోజూ ఎవరైనా కానీ ఇష్టమైన ఆహారాలను తినేందుకే చూస్తుంటారు. ఇష్టం లేని ఆహారాలను అసలు ముట్టుకోరు. ఇంట్లో ఏదైనా ఇష్టం లేని కూర చేస్తే ముద్ద కూడా ముట్టరు. అయితే ఇలా చాలా మందికి రకరకాల ఆహారాలు అంటే ఇష్టం ఉండదు. అలాంటి ఆహారాల్లో ముల్లంగి కూడా ఒకటి. ఇది ఘాటైన వాసన, రుచిని కలిగి ఉంటుంది. కనుక చాలా మంది దీన్ని తినేందుకు అయిష్టతను ప్రదర్శిస్తుంటారు. ముల్లంగితో చాలా మంది కూర లేదా పచ్చడి చేస్తుంటారు. దీన్ని ముక్కలుగా కట్ చేసి సాంబార్ వంటి వాటిలోనూ వేస్తుంటారు. అయితే వాస్తవానికి ముల్లంగి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఈ క్రమంలోనే రోజుకు 1 ముల్లంగిని తింటే అనేక లాభాలను పొందవచ్చు.

**ఇమ్యూనిటీ పెరుగుతుంది..:** ముల్లంగి మనకు చలికాలంలో ఎక్కువగా లభిస్తుంది. ఇది సీజన్‌లో ఎక్కువగా వస్తుంది కానీ ఏడాది పొడవునా మనకు అందుబాటులో ఉంటుంది. అందువల్ల ముల్లంగిని రోజూ తినడంలో ఎలాంటి ఇబ్బంది ఎదురు కాదనే చెప్పాలి. ఇక ముల్లంగిని సలాడ్స్, పరాఠాలు, చట్నీల్లో తినవచ్చు. ఇందులో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అందువల్ల జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇంకా ముల్లంగిని తినడం వల్ల ఎన్నో లాభాలు కలుగుతాయి. కనుక రోజుకు ఒక ముల్లంగిని ఆహారంలో భాగం చేసుకోవాల్సి ఉంటుంది.

**జీర్ణవ్యవస్థకు..:** ముల్లంగిలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. ఫైబర్ వల్ల సుఖ విరేచనం అవుతుంది. దీంతో మలబద్ధకం సమస్య నుంచి బయట పడవచ్చు. ముల్లంగిని తినడం వల్ల పైత్య రసం ఉత్పత్తి అవుతుంది. దీంతో లివర్ పనితీరు మెరుగు పడుతుంది. ఫలితంగా పిత్తాశయం సక్రమంగా పనిచేస్తుంది. అందులో రాళ్లు ఏర్పడకుండా చూసుకోవచ్చు. ముల్లంగిలో సహజసిద్ధమైన క్లీనింగ్ గుణాలు ఉంటాయి. అందువల్ల లివర్ ఆరోగ్యంగా ఉంటుంది.



దీంట్లో సల్ఫర్ ఆధారిత సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. కనుకనే ముల్లంగి ఘాటు ఎక్కువగా ఉంటుంది.

**లివర్ క్లీన్ అవుతుంది..:** అయితే ఘాటు ఉన్నా కూడా ముల్లంగిని రోజూ ఏదో ఒక విధంగా తింటుండాలి. దీంతో శరీరంలోని విష, వ్యర్థ పదార్థాలు, లివర్‌లోని టాక్సిన్లు బయటకు పోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రమవుతుంది. దీని వల్ల అన్ని విధాలుగా ఆరోగ్యం గా ఉంటారు. ముల్లంగిలో విటమిన్ సి ఉంటుంది. ఇది రోగ నిరో ధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. ముల్లంగిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను బయటకు పంపించడంలో సహాయ పడతాయి. దీంతో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు, ఫ్లూ నుంచి రక్షణ లభిస్తుంది.

**బరువు తగ్గేందుకు..:** ముల్లంగిలో క్యాలరీలు తక్కువగా నీటి శాతం ఎక్కువగా ఉటుంది. అందువల్ల వీటిని తింటే బరువు తగ్గాలనుకునే వారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ముల్లంగిని తినడం వల్ల ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఫలితంగా ఇది బరువు తగ్గేందుకు సహాయపడుతుంది. ఇలా ముల్లంగిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. కనుక ఈ సీజన్‌లో దీన్ని విడిచిపెట్టకుండా, మరిచిపోకండి తినండి. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

## బెండకాయలను తింటే ఇన్ని లాభాలు కలుగుతాయా.. తెలిస్తే షాకవుతారు..!



బెండకాయలు.. వీటినే ఇంగ్లీష్‌లో ఓక్రా అని, లేడీస్ ఫింగర్ అని కూడా పిలుస్తారు. బెండకాయలను మొదటగా ఆఫ్రికాలో పండించారు. అక్కడి నుంచి ఇవి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకు వ్యాపించాయి. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది బెండకాయలను ఎంతో ఇష్టంగా తింటుంటారు. వీటితో అనేక రకాల వంటకాలను చేస్తుంటారు. బెండకాయలను లేతగా ఉన్నప్పుడే తినాల్సి ఉ ంటుంది. ముదిరితే రుచి అంత బాగోవు. ఇక బెండకాయలతో మనం వేపుడు, పులుసు వంటివి చేస్తుంటాం. చాలా మంది వీటిని చారు వంటి వాటిలోనూ వేస్తుంటారు. దీంతో ఇవి చక్కని రుచిని కలిగి ఉంటాయి. అయితే బెండకాయలను తరచూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వీటిల్లో విటమిన్లు ఎ, సి సమృద్ధిగా ఉంటాయి. అలాగే పొటాషియం, మెగ్నిషియం కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి.

హార్ట్ ఎటాక్ రాదు..: బెండకాయల్లో విటమిన్లు ఎ, సిలతోపాటు మెగ్నిషియం, పొటాషియం, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనల్ని అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ కాయలను తరచూ తినడం వల్ల వీటిల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమయ్యేలా చేస్తుంది. దీంతో మలబద్ధకం తగ్గుతుంది. బెండకాయలను తరచూ తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. జీర్ణవ్యవస్థలో ఉ ండే మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణాశయం, పేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. బెండకాయలను తినడం వల్ల మన శరీరం ఆహారాల్లో ఉండే కొవ్వును శోషించుకోదు. దీంతో శరీరంలో కొలెస్ట్రాల్ చేరకుండా అడ్డుకోవచ్చు. ఫలితంగా రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

అధిక బరువు తగ్గుతారు..: బెండకాయల్లో పాలిఫినాల్స్ అనే సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయి. అలాగే వీటిల్లో ఫైబర్ కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తాయి. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది. మధుమేహం ఉ న్నవారికి బెండకాయలు ఒక వరం అనే చెప్పవచ్చు. వీటితో డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. బెండకాయలను తినడం వల్ల విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో రోగాలు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. అధిక బరువు ఉ న్నవారు బెండకాయలను తరచూ తింటుంటే బరువును తగ్గించుకోవచ్చు. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయకుండా చేయడంలో బెండకాయలు ఎంతో ఉపయోగపడతాయి. దీంతో అధిక బరువును తగ్గించుకోవచ్చు.

కంటి చూపు మెరుగు పడుతుంది..: బెండకాయల్లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. తరచూ బెండకాయలను తినడం వల్ల కళ్లను ఆరోగ్యంగా ఉ ంచుకోవచ్చు. వయస్సు మీద పడడం వల్ల వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. వీటిని తింటుంటే శరీరంలోని నొప్పులు, వాపులను తగ్గించుకోవచ్చు. బెండకాయల్లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు శరీరంలోని నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. ఈ కాయల్లో క్యాల్షియం, విటమిన్ సి, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇలా బెండకాయలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య

## ప్రజాప్రతినిధుల మధ్య ఫైట్..

ఖమ్మం,: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కీలకమైన ప్రాంతం భద్రాచలం నియోజకవర్గం. ఏజెన్సీ ప్రాంతంతో పాటు దక్షిణ అయోధ్యగా పిలువబడే ప్రాంతమిది. ఇలాంటి పుణ్యక్షేత్రాల్లో పోలీస్ పోస్టింగ్ ఉంటే రాజకీయ, అధికారులతో పరిచయాలు పెరుగుతాయి. దర్శనాలు చేయించి అధికారులను మచ్చిక చేసుకోవ చ్చు.

అక్కడ పోస్టింగ్ వస్తే చాలు.. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడైనా కావాల్సిన పనులు చేయించుకోవచ్చు. అలాంటి పోస్టింగ్ కోసం పైరవీలు భారీగా సాగుతాయి.అయితే ఆ పైరవీలు ఇప్పుడు భద్రాచ లంలో ఇద్దరునేతల మధ్య పంతాన్ని రాజేశాయి. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పొదెం వీరయ్య ఓటమి పాలైయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన డాక్టర్ తెల్లం వెంకట్రావు కొద్దిరోజులకే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అప్పటి వరకు పొదెం వీరయ్య వర్సెస్ తెల్లం వెంకట్రావుగా ఉండే రాజకీయాలు ఒక్కసారిగా.. ఒకే పార్టీలో రెండు వర్గాలుగా మారిపోయాయి. పొదెం వీరయ్యకు భట్టి విక్రమార్క అండదండలు ఉన్నాయి. కార్పొరేషన్ పదవి కూడా తెచ్చుకున్నారు. తెల్లం వెంకట్రావుకు మంత్రి పొంగులేని శ్రీనివాస్‌తో మంచి సాన్నిహిత్యం ఉంది.వీళ్లద్దరి మధ్య ఉన్న పంతానికి భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ పోస్టింగ్‌లే కొలమానంగా మారిపోయాయి. గత ప్రభుత్వంలో భద్రాచలం పోస్టింగ్ కోసం ఆర్ వెంకటేశ్వర్లు ప్రయత్నించి విఫలమయ్యారు. కొత్త ప్రభుత్వం రాగానే ఎట్టకేలకు భద్రాచలం పోస్టింగ్ తెచ్చుకున్నాడు. అయితే ఆయన బాధ్యతలు చేపట్టి నెల రోజులు కాకముందే ఆర్ వెంకటేశ్వర్లకు బదిలీ ఆర్డర్ వచ్చేసింది. ఈయన బదిలీ వెనుక పొదెం వీరయ్య హస్తం ఉ ందని లోకల్ టాక్. సంజీవ రావు అనే పోలీస్ ఆఫీసర్ కోసమే.. వెంకటేశ్వర్లను బదిలీ చేయించారని ప్రచారం జరిగింది. సీఐ సంజీవరావు వచ్చి ఏడాది కూడా కాలేదు. ఈయనకు కూడా బదిలీ ఉత్తర్వులు రానే వచ్చేశాయి. దీని వెనుక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వ్యూహం ఉందనే గాసిప్ బలంగా వినిపిస్తోందిసీఐ సంజీవరావు ప్లేస్‌లో బరపాటి రమేశ్ అనే పోలీస్ ఆఫీసర్‌ను తీసుకుని వచ్చారని లోకల్ గాసిప్. ములుగుకు చెందిన రమేశ్‌కు పొదెం వీరయ్య ప్రత్యర్థి అయిన సీతక్క అండదండలు ఉన్నాయన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. బదిలీ లెటర్ రాగానే రమేశ్ హుటాహుటానా భద్రాచలంలో పీఎస్‌లో రిపోర్ట్ చేశారట. అయితే ఇక్కడే ట్విస్ట్ ఉంది. పాత సీఐ సంజీవరావు బదిలీ అవ్వడానికి ఇష్టపడటం లేదట. తాను వచ్చి కనీసం ఏడాది కూడా కాలేదని అప్పుడే బదిలీ ఎలా చేస్తారంటూ స్వరం వినిపిస్తున్నాడట. ఎలాగైనా తన బదిలీ అప్పించాలంటూ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యను రిక్వెస్ట్ చేస్తున్నారట.దీంతో కోపంతో ఊగిపోయిన పొదెం వీరయ్య.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమా ర్కకి ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. తాను తీసుకొచ్చిన వ్యక్తిని ఎలా బదిలీ చేస్తారంటూ నిలదీస్తున్నారట. ఇది ముమ్మాటికి తనకే అవమా నమే అంటూ అసంతృప్తి వెళ్లగక్కారట. ఇటు ఎమ్మెల్యే తెల్లం సైతం సీఐ పోస్టు పంచాయితీని మంత్రి పొంగులేటి దగ్గరకు తీసుకువె ళ్లారట. మొత్తానికి భద్రాచలం టౌన్ సీఐ పోస్ట్ పంచాయితీ మంత్రుల ముందుకు వెళ్లింది. ఇక్కడ రమేశ్ సీఐగా వస్తే తెల్లం పంతం నెగ్గినట్టు.. సంజీవరావును సీఐగా కొనసాగిస్తే.. పొదెం వీరయ్యకు మాట నిలబడినట్టు.. మరి రాయయ్య ఊరిలో చెలరేగిన ఈ పోస్టింగ్ పంచాయితీని మంత్రులు ఎలా డీల్ చేస్తారో

# ఎత్తిపోతలు వదిలేశారు.. అన్నదాతను ముంచేశారు..?

సీతానగరం: ఉమ్మడి జిల్లాలో లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే ఎత్తిపోతలపై నిర్లక్ష్యం ఉందనడానికి నిదర్శనమే పుష్కర, పురుషోత్తపట్నం ప్రాజెక్టులు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో గోదావరి ఎడమ గట్టున గత ప్రభుత్వంలో సుమారు రూ.2,356 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. ఏటా నిర్వహణ చేసేలా బడ్జెట్‌లో పెట్టి రూ.2.5 కోట్లకు పైగా నిధులు ఇచ్చేది. వైకాపా ప్రభుత్వం వచ్చాక నిర్వహణకు ఇచ్చే నిధులకు మంగళం పాడేసింది. వదిలేయాలో తెలియని పరిస్థితుల్లో యంత్రాంగం ఉంది. తొలకరి వర్షాలు మొదలై ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నా ఎత్తిపోతలు ప్రశ్నార్థకంగా మారాయంటున్నారు రైతులు. గత ఖరీఫ్ సీజన్లో పుష్కర ఎత్తిపోతల నుంచి సాగునీరు సరఫరా పూర్తిస్థాయిలో చేసేందుకు మోటార్లు, లీకేజీల పనులు పూర్తికాలేదు. పుష్కర నుంచి ఒక్కో పంపు ద్వారా 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా 8పంపులు సామర్థ్యంతో పథకాలు ఉన్నాయి. నాలుగైదు పంపులు మాత్రమే పనిచేయడంతో అవసరమైన 1400 క్యూసెక్కులుదీంతో గుత్తేదారులకు రూ.12 కోట్లకు పైగా బకాయి పేరుకుపోయింది. ఈ ఏడాది పుష్కర ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, మోటార్ల బిగింపు, లీకేజీలు అరికట్టేలా రూ.4.26 కోట్లకు పిలిచిన టెండర్లు అలాగే ఉండిపోయాయి. 8మోటార్లకు గానుఆరే పనిచేస్తున్నాయి. గొట్టాల ద్వారా సరఫరాఅయ్యే సాగునీరుకు 32చోట్లకుపైగా లీకేజీలు పడ్డాయి. పంపు హౌస్‌వెల్ వద్ద వేసిన ఇసుక మేటలకు పూడికతీతపనులు లేవు. కాకినాడ జిల్లాలోని తుని వరకు 1.86 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పథకాలు గడిచిన ఐదేళ్లగా 1.36 లక్షల ఎకరాలకు నీరు అందించడం గగనంగా మారింది. పురుషోత్తపట్నం ఎత్తిపోతలపై పర్యావరణ అనుమతులకు ఎన్జీటీ పరిహారం రూ.2.48 కోట్లపై న్యాయస్థానంలో తీర్పు రిజర్వులో ఉంది. పథకం తిప్పాలో, వదిలేయాలో తెలియని పరిస్థితుల్లో యంత్రాంగం ఉంది. తొలకరి వర్షాలు మొదలై ఖరీఫ్ సాగుకు సమా



యత్తమవుతున్నా ఎత్తిపోతలు ప్రశ్నార్థకంగా మారాయంటున్నారు రైతులు. గత ఖరీఫ్ సీజన్లో పుష్కర ఎత్తిపోతల నుంచి సాగునీరు సరఫరా పూర్తిస్థాయిలో చేసేందుకు మోటార్లు, లీకేజీల పనులు పూర్తికాలేదు. పుష్కర నుంచి ఒక్కో పంపు ద్వారా 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా 8 పంపులు సామర్థ్యంతో పథకాలు ఉన్నాయి. నాలుగైదు పంపులు మాత్రమే పనిచేయడంతో అవసరమైన 1400 క్యూసెక్కులు మెట్టకు సరఫరా చేయలేని పరిస్థీఈతి. గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు కంటే దిగువకు చేరడం.. పూడికతీత పనులు చేస్తేనే మిగిలిన పంపులు తిరుగుతాయి. ఆ పనులు చేసేందుకు నయా పైసాలేక వదిలేశారు. రోజులో 12 గంటల సమయం మాత్రమే ఒక పంపు తిరిగేది. 24 గంటలు ఆన్‌చేస్తే ఇసుక చేరిపోవడంతో మోటార్లు పోతాయని జలవనరులశాఖ హెచ్చరికలతో ఆ ఒక్క పంపును సగం గంటలే తిప్పేవారు. మెట్టలోని పలు ప్రాంతాల్లో పొలాలు ఎండిపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు.

# హెచ్చెల్సీ గట్లు కోత- నీటి సరఫరాకు ఆటంకం

బొమ్మనహాళ్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర ఎగువ కాలువ గట్లు కోతకుగురై నీటి సరఫరాకు ఆటంకం కలగుతోంది. హెచ్చెల్సీ నీటి విడుదలకు సమయం సమీపిస్తున్న తరుణంలో కాలువ గట్లు కోతకు గురవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర మరమ్మతులు చేయకపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశంఉంది. జీబీసీ సమీపంలోని 181, 130 కిలోమీటర్ల సమీపంలో కాలువ గట్టు కోతకు గురవడంతో వాగునీరు ప్రధాన కాలువలోకి వచ్చాయి.
119, 600 కిలోమీటరు చెర్లోపల్లి వద్ద హెచ్చెల్సీ ప్రధాన కాలువకు నిర్మించిన యూటీ(అండర్ టన్నెల్)కి బెడ్ లెవెల్ సిమెంటు కట్టడం పగులు వచ్చి గండి పడింది. మైలాపురం వద్ద కూడా ఇరువైపులా గట్లు కోతకు గరయ్యాయి. కణేకల్లు ఔట్ ఫాల్ గేట్ల వద్ద గతేడాది వంతెన కూలడంతో రోడ్డును తాత్కాలిక మరమ్మతులు చేశారు.
అది కూడా వర్షానికి కుంగిపోయే ప్రమాదం పొంచి ఉంది. హెచ్ఎల్ఎంసీ పరిధిలో దెబ్బతిన్న కాలువ గట్లను ఎస్ఈ రాజశేఖర్, ఈఈ రమణారెడ్డి, డీఈఈ మద్దిలేటి పరిశీలించారు. ఎక్కడెక్కడ మరమ్మతులు అవసరమో



గుర్తించామన్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై ఎస్ఈ రాజశేఖర్ మాట్లాడుతూ హెచ్ఎల్ఎంసీ పరిధిలో వర్షాలకు కోతకు గురైన హెచ్చెల్సీ ప్రధాన కాలువ గట్లు, యూటీలను పరిశీలించాం. మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేసి.. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని ఆయన తెలిపారు.

# సమతులాహారంతో ఆరోగ్యానికి మేలు

ఆహారానికి సంబంధించి మనలో ఎన్నో అపోహలున్నాయి. గుడ్డు తింటే ఆరోగ్యానికి మేలని కొందరు చెబుతుంటే ఎగ్‌తో కొలెస్ట్రాల్ పెరుగుతుందని మరికొందరు చెబుతుంటారు. గుడ్డులో అధిక ప్రొటీన్‌తో ఆరోగ్యానికి మేలని కానీ పరిమితంగా తీసుకుంటే మంచిదని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు. ఆహారంలో మంచీ, చెడు అంటూ ఉండవని ఏమైనా మితంగా, సమతూకంతో సమతులాహారం తీసుకోవాలని న్యూట్రిషనిస్ట్ మామి అగర్వాల్ సూచిస్తున్నారు. ఇన్‌స్టాగ్రాంలో తన లేటెస్ట్ వీడియోలో ఆహారానికి సంబంధించిన అపోహలను క్లియర్ చేసే వివరాలను ఆమె పంచుకున్నారు. ఈ వీడియోలో నాలుగు ఆహార పదార్థాల గురించి ఆమె ప్రస్తావించారు. పోషకాలతో కూడిన నెయ్యిని సూపర్ ఫుడ్‌గా చెబుతుంటారు. అయితే మోతాదు మించితే మంచి ఆహారమైనా చెడుగా మారుతుంది. నెయ్యిని అధికంగా వేడి చేస్తే అనారోగ్యకర పదార్థాలు పేరుకుపోయే ప్రమాదం ఉంది. నెయ్యిని డీప్ ఫ్రై చేయకుండా ఆహారం రుచి కోసం ఓ టేబుల్ స్పూన్ వాడటం మేలని, మితంగా దీన్ని తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని మామి అగర్వాల్ చెబుతున్నారు. ఇక రోజువారీ ఆహారంలో భాగమైన రైస్‌ను పూర్తిగా దూరం పెట్టాల్సిన అవసరం లేదు. బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరగకుండా ప్రొటీన్, ఫైబర్‌తో బ్యాలెన్స్ చేసేలా చూసుకోవాలి. రైస్‌ను పరిమితంగా తీసుకుంటే ఆరోగ్యానికి జరిగే హాని ఏమీ లేదని చెప్పారు. ఇక ప్రొబయాటిక్స్, యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉండే పచ్చళ్లను కూడా పరిమిత మోతాదులో తీసుకోవచ్చు.



వీటిలో సోడియం అధికంగా ఉండటంతో మితంగా తినడం మేలని ఆమె సూచిస్తున్నారు. ఇక కొబ్బరి కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుందని, ఇందులో ఉండే ఆరోగ్యకర కొవ్వులు, ఎంసీటీలు మంచివని పేర్కొన్నారు. ఇందులో పోషకాలు అధికంగా ఉన్నా క్యాలరీలు కూడా ఎక్కువే కావడంతో దీన్ని మితంగా తీసుకోవాలి. సమతులాహారంలో భాగంగా కొబ్బరిని పరిమిత మోతాదులో తీసుకుంటే చాలు. ఏ ఆహారం తీసుకున్నా అన్ని రకాల పోషకాలు ఉండేలా సమతులాహారం తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెప్పుకొచ్చారు.

## వెజిటేరియన్లు అయిన పిల్లలకు ప్రొటీన్ ఎలా?

# ఎలాంటి ఆహారం పెట్టాలి..?

పిల్లల ఎదుగుదలకు ప్రొటీన్ చాలా అవసరం. కానీ శాకాహారులకు సాధారణ ఆహారంలో అది సరిపడినంత దొరకడం కష్టం అంటారు కదా! మరి వెజిటేరియన్లు అయిన పిల్లలు చక్కగా ఎదగాలంటే ఎలాంటి ఆహారం పెట్టాలి. జీడిపప్పు, బాదం లాంటి ఖరీదైనవి కాకుండా మామూలు ఆహారం తినేవాళ్లకు కూడా సరిపోయేలా ఏమైనా పదార్థాలు ఉన్నాయా? తెలుపగలరు. నిర్మాణంలోనూ, దాని పనితీరులోనూ ఇది కీలకపాత్ర పోషిస్తుంది. మన శరీరంలోని సగానికిపైగా ప్రొటీన్ కండరం రూపంలో మిగతాది ఎముక, మజ్జ, చర్మాల్లో ఉంటుంది. 20 దాకా అమైనో యాసిడ్ల సమ్మేళనంగా ఇది తయారైక్కని పౌష్టికాహారం పిల్లల ఎదుగుదలకు అత్యావశ్యకం. అందులోనూ శరీర నిర్మాణానికి ప్రొటీన్ చాలా అవసరం. ప్రతి కణంతే, అందులో 9 ముఖ్యమైన వాటిని మనం ఆహారం ద్వారా తీసుకోవలసిందే. సాధారణంగా మాంసంలో దొరికే ప్రొటీన్‌లో ఇవన్నీ ఉంటాయి. శరీరం దాన్ని బాగా శోషించుకుంటుంది కూడా. కానీ శాకాహారం విషయంలో ఇలా ఉండదు. ఈ పదార్థాల్లో కొన్ని రకాల అమైనో యాసిడ్లు తక్కువగా దొరుకుతాయి. తృణధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పుల సమ్మేళనంగా మన ఆహారాన్ని మలచుకుంటే ఇవన్నీ దొరకడం కష్టమేం కాదు. ఇందుకోసం, 3:1 నిష్పత్తిలో ధాన్యాలు, పప్పులు కలిపి తీసుకోవాలి. రోజూ పావు లీటరు పాలు దీనికి జోడించాలి. కందులు, పెసలు, ఉలవలు, మినుములు, బఠాణీలు, శనగలు, బొబ్బర్లు, బీన్స్‌లాంటి చిక్కుడు జాతి గింజల్లో ప్రొటీన్ పుష్కలంగా లభిస్తుంది. అలాగే బాదం, పిస్తా, జీడిపప్పు, వాల్‌నట్స్, నువ్వులు, గుమ్మడి, అవిసె గింజల్లో కూడా ఇది అధిక మోతాదులో దొరుకుతుంది. విభిన్న రకాల రుచికరమైన వంటల రూపంలో వీటిని ఆహారంలో భాగం చేయడం ద్వారా మనం



పిల్లలకు కావలసిన ప్రొటీన్‌ని అందించగలుగుతాం. ఉడికించిన శనగలు, అలసందలు, బొబ్బర్లతో గుగ్గిళ్లు చేసి పెట్టొచ్చు. పెసరట్టు పప్పుల చట్నీ, పెసలు కందులు వేసిన కిచిడీలు, బిసిబేళాబాత్, పచ్చి శనగపప్పు గోధుమ పిండితో చేసే పోలెలు కూడా మంచివే. పనీర్ పులావ్, సోయా పులావ్ లాంటివీ బాగుంటాయి. మొలకెత్తినగింజలతో చేసే స్టీమ్డ్ టిక్కా, సున్నుండల్లాంటివి బలాన్నిస్తాయి. ఇడ్లీ, దోశల్లోనూ ప్రొటీన్ దొరుకుతుంది. బతుకమ్మ పండుగకు చేసే రకరకాల సత్తుపొడులు,శనగపప్పు కలిపి చేసే సర్వపిండి కూడా ఈ కోవలోవే. పండ్లలో గింజల్ని కలిపి ఇవ్వచ్చు. దానిమ్మ గింజల్లో గుమ్మడి, పుచ్చ లేదా సన్‌ఫ్లవర్ గింజల్లాంటివి కలిపి పెట్టొచ్చు. గ్లాసెడు పాలల్లో డ్రైఫ్రూట్ పొడి కలిపి, లేదా చిరుధాన్యాలను మొలకెత్తించి బెల్లంతో కలిపిన పొడి కలిపి ఇవ్వచ్చు.

# భూభాగోతాలకు చెక్..!



వరంగల్: భూ సమస్యల పరిష్కారం, భూముల పరిరక్షణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చింది. ఈ పోర్టల్ ద్వారానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అయితే ధరణి కారణంగా చాలామంది భూముల నమోదులో పొరపాట్లు జరిగాయి. ఎక్కువ తక్కువ భూములు నమోదయ్యాయి. సాగులో లేని భూములను కూడా సాగు భూములుగా చూపించారు. దీంతో రైతులు అధికారుల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నారు. సీసీఎల్ఏ కొన్ని సమస్యలు పరిష్కరించినా.. ఇప్పటికీ కలెక్టర్ల వద్ద వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక చాలా ప్రభుత్వ భూములు నాయకుల పేరిట పట్టాలు అయ్యాయి. ఈనేపథ్యంలో భూ అక్రమాలకు చెక్ పెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టం అమలు చేయాలని నిర్ణయించింది. ఇటీవలే అసెంబ్లీ, శాసన మండలిలో బిల్లు ఆమోదం పొందింది. గవర్నర్ ఆమోదం కోసం ప్రభుత్వం పంపించింది. గవర్నర్ ఆమోదించగానే చట్టంగా మారుతుంది. అయితే కొందరు అధికారుల తీరుతో భూరికార్డుల్లో తప్పులు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. లంచాలకు ఆశపడి, ప్రభుత్వ పెద్దల మాటలు విని, బెదిరింపులకు భయపడి ఇతర కారణాలతో కొందరు అధికారులు రికార్డులు మారుస్తున్నా రు. ఈ క్రమంలో భూ వివాదాలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టంతో భూ సమస్యలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. భూ భారతి చట్టాని రాష్ట్ర రెవెన్యూ అధికారులు వ్యతిరేకిస్తున్నారు. అయినా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. భూముల వివరాలు తప్పుగా నమోదు చేసే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చట్టంలో నిబంధన పొందుపరిచారు. ఏ అధికారి స్థాయిలో తప్పు జరిగితే ఆ అధికారిపైనే చర్యలు తీసుకునేలా చట్టం ఉంది. అవసరమైతే ఆ అధికారిని ఉద్యోగం నుంచి తొలగించేలా నిబంధన చేర్చారు. ఇందు కు ఐఏఎస్ ఆఫీసర్లు కూడా అతీతులు కాదని సెక్రటేరియేట్ వర్గాలు తెలిపాయి. ఇక భూ సమస్యలను చాలా వరకు గ్రామస్థాయిలోనే పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామాల్లో వీఆర్వోల స్థానంలో జే ఆర్వోలను నియమించాలని నిర్ణయిం చింది. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక జేఆర్వో ఉంటారు. గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా జేఆర్వో వ్యవస్థను తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా4 11 వేల మందిని నియమించేలా కసరత్తు చేస్తోంది

# ఆదాయం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్

అమరావతి: ఆదాయాన్ని పెంచుకునేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగామార్చి నెలాఖరుకు కనీసం పదివేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రిజర్వ్‌బ్యాంకు, కాగ్, అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం అధికారులు వెలువరిస్తున్న గణాంకాలు కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. సొంత పన్నుల ఆదాయం పడిపోవడం, కేంద్రం నుంచి కూడా నిధుల రాబడి తగ్గిపోవడం వంటి కారణాలతో ఎక్కువగా అప్పులపైనే ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు ఖజానాకు వాస్తవంగా రావాల్సిన ఆదాయం కూడా తగ్గుతోందని ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు. దీంతో బకాయిలపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆర్థికశాఖ నిర్ణయించింది. రాష్ట్ర ఖజానాకు వాస్తవంగారావాల్సిన నిధుల్లో ఎక్కువగా అమ్మకపు పన్ను, జీఎస్‌టి, గనులు, విద్యుత్ బకాయిలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు వంటి శాఖల నుంచే బకాయిలు ఉన్నాయని అధికారులు అంటున్నారు. ఒక్క గనుల శాఖ నుంచే నాలుగు వేల కోట్ల వరకు ఆదాయం రావాల్సి ఉందని ఆర్థికశాఖ అధికారి ఒకరు చెప్పారు. లీజు నిధులే కాకుండా, రాయల్టీ, ఇతర వసూళ్లలో కూడా లోటు కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. అందుకే పాత లెక్కలను వెలికితీసి బకాయిలుగా ఉన్న మొత్తాన్ని తిరిగి వసూలు చేయాలని నిర్ణయించినట్లు ఒక అధికారి




వెల్లడించారు. ఇదే సమయంలో పెద్ద మొత్తంలో విద్యుత్ బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్ల శాఖలో కూడా ఆదాయం తగ్గిందని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖకు రాకుండానే క్షేత్రస్థాయిలోనే ఒప్పదాలు జరిగిపోతున్నాయని, అందుకే ఆదాయానికి భారీగా గండిపడుతోందని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. కేంద్రం నుంచి 30వేల కోట్లు రావాల్సి ఉండగా, కేవలం ఇప్పటివరకు పది వేలకోట్లు మాత్రమే రావడంపైనా ఆర్థిక శాఖ దృష్టి సారిస్తోంది. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని కనీసంగా పది వేలకోట్ల రూపాయలను మార్చి లోగా సమకూర్చుకోవాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన ఒక సమీక్షలో కూడా ఇదే దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది.

# విద్యారంగంలో కీలక మార్పులు!



ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 117ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. అయితే జీవో 117ను రద్దు చేసినప్పటికీ ఇంచుమించు అదే విధానాలతో మళ్లీ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులను విడుదల చేశారు. గత జీవో నెంబర్ 117లో కంటే కొన్ని మార్పులు చేశారు. గతంలో ఉన్న ఆరు రకాల పాఠశాలలకు బదులు ఐదు రకాల పాఠశాలల విధానాన్ని కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. గతంలో ప్రవేశపెట్టిన శాటిలైట్ ఫౌండేషనల్ స్కూళ్ల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించింది. ఫౌండేషనల్ స్కూళ్లను అలానే కొనసాగించింది. అయితే ఫౌండేషనల్ స్కూల్ ప్లస్ పేరును బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మర్చింది. ప్రీ హైస్కూల్ విధానాన్ని రద్దు చేసి మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ముందుకు తీసుకొచ్చింది. 3,4,5 తరగతుల విలీనాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే హై స్కూల్ ప్లస్ విధానాన్ని ఏం చేస్తారో అనేది స్పష్టం ఇవ్వలేదు. ఫౌండేషనల్, బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు 1:20 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్న విద్యా వేత్తల డిమాండ్‌ను పట్టించుకోలేదు. గత ప్రభుత్వం వలే ఇప్పుడు కూడా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని నిర్ణయించింది. పెరగనున్న ఏకోపాధ్యాయ పాఠశాలలు?: ఫౌండేషనల్ స్కూల్‌లో 1:30 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించింది. విద్యార్థులు సంఖ్య 30 దాటితే మరో ఎస్జీటీని కేటాయిస్తామని పేర్కొంది. బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో 1:20 నిష్పత్తి ప్రకారం అమలుచేస్తామని 60 దాటితేనే మరోపోస్టు ఉంటుందని తెలిపింది. దీనివల్ల ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 60 కంటే తక్కు ఉంటే ఐదు తరగతులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుగురిని కేటాయిస్తారు. ఎన్‌రోల్‌మెంట్ 120 కంటే ఎక్కువ ఉంటే ప్రధానోపాధ్యాయ పోస్టు ఉంటుంది.
150 దాటితే ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీ ఉంటారు. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య 45-60 మధ్య ఉన్నా మోడల్ ప్రైమరీ స్కూల్ ఉంటుంది. అయితే సామాజిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల ఆధారంగా పాఠశాల యాజమాన్య కమిటీ మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటును ప్రతిపాదించే అవకాశం ఉంటుంది. అయితే దీంతో మళ్లీ పాత పద్ధతికే పాఠశాల విద్య వస్తుంది. ప్రైవేట్ పాఠశాలల్లో చేరికలు పెరుగటంతో పాటు?. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్‌అవుట్ రేటు పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు సంఖ్య 30కంటే తక్కువగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్, బేసిక్ ప్రైమరీగా మార్చుతారు. 6,7,8 తరగతుల విద్యార్థులను దగ్గరలో ఉన్న పాఠశాలలకు తరలిస్తారు. 6,7,8 తరగతులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 కంటే ఎక్కువగా ఉంటే, దానిని హైస్కూల్‌గా మార్చుతారు. హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 76 కంటే ఎక్కువగా ఉంటేనే ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ పోస్టులు ఉంటాయి. విద్యార్థుల సంఖ్య 400 దాటితే ఆయా స్కూల్స్‌కు రెండో పీఈటీని కేటాయిస్తారు. విద్యార్థుల సంఖ్య 751ఉంటే మూడో పీఈటీ పోస్టు ఉంటుంది. పోస్టులు, విద్యార్థుల సంఖ్యఆధారంగా మ్యూజిక్, ఆర్ట్, డ్రాయింగ్,క్రాఫ్ట్ పోస్టులు ఉంటాయి. గ్రామపంచాయతీ,మున్సిపల్ వార్డులలో మోడల్ ప్రైమరీస్కూల్ గుర్తించేందుకు కమిటీలు ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో ఉండే కమిటీలో కన్వీనర్‌గా ఎంఈవో-1,కోకన్వీనర్‌గా ఎంఈవో-2ఉంటారు. సభ్యులుగా ఐసీడీఎస్ సీడీపీవో, ఎంఆర్‌వోతో పాటు ఎంపీడీవోగానీ మున్సిపల్ కమిషనర్‌గానీ సభ్యులుగా ఉంటారు. క్లస్టర్‌స్థాయి కమిటీల్లో కన్వీనర్‌గా క్లస్టర్ ప్రధానోపాధ్యా యుడుకన్వీనర్‌గా, సభ్యులుగాఎంఈవో 1,2, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఉంటారు.

## భవన నిర్మాణ అనుమతులు మరింత సరళం..!

విజయవాడ: ఏపీలో భవన నిర్మాణాలు,లే ఔట్ల అనుమతుల జారీలో నిబంధన లు సులభతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బిల్డింగ్ రూల్స్-2017, ఏపీల్యాండ్ డెవలప్మెంట్ రూల్స్ - 2017లో సవరణలు చేస్తూ వేరు వేరుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా భవన, లే అవుట్ల అనుమతుల్లో మార్పులు తీసుకొచ్చినట్టు మంత్రి నారాయణ చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా కీలక సంస్కరణలతో ఉత్తర్వులు జారీ చేశామని, సంక్రాంతి కానుకగా బిల్డర్లు, డెవలపర్లు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిబంధనలు మార్పులు జీవోలు జారీ చేసినట్టు చెప్పారు. లేఅవుట్లలో వేసే రోడ్లకు గతంలో ఉన్న12 మీటర్లకు బదులు 9 మీటర్లకు కుదిస్తూ సవరణ చేశారు. 500 చ.మీ. పైబడిన స్థలాల్లో చేపట్టే నిర్మాణాల్లో సెల్లారుకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. టీడీఆర్ బాండ్ల జారీ కమిటీలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ ల ప్రమేయాన్ని తొలగిస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీటర్ల మేరకు సర్వీస్ రోడ్డు విడిచిపెట్టాలనే నిబంధన తొలగిస్తున్నట్టు ప్రకటించారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేశారు. వీటితో పాటు మరిన్ని నిబంధనలు సరళతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా చేసేందుకు సంస్కరణలు చేపట్టి.. ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో లే అవుట్లలో రోడ్లకు గతంలో 12 మీటర్లు ఉండగా.. ఇప్పుడు దానిని 9 మీటర్లకు తగ్గించారు.

# వృథాను అరికడదాం.. అభాగ్యుల ఆకలి తీరుద్దాం

సూర్యాపేట: దుక్కిదున్ని, నారుమడి సిద్ధం చేసి.. విత్తనాలు విత్తితే మొల కెత్తడానికి వారం రోజుల సమయం పడుతుంది. నారు ఎదిగేందుకు.. నాటుకు 25 రోజులు.. ఎరువులు చల్లి.. కలుపు తీసి.. సస్యరక్షణ చేపడితే కొద్ది రోజులకు సన్న వడ్లు చేతికి వస్తాయి.. ఇలా విత్తనం.. వరిగింజగా మారడానికి అన్నదాత 95 రోజులూ స్వేదం చిందించి శ్రమించాల్సిందే. అన్నదాత అంత కష్టపడి.. వర్షాల నుంచి పంటను కాపాడి.. అన్నాన్ని చేతికిందిస్తే.. శుభకార్యాలు, హోటళ్లల్లో నిత్యం కిలోల కొద్దీ ఆహారాన్ని వృథాగా పడేస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలైన నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి వంటి పట్టణాల్లో అభాగ్యులు, పేదలు ఆహారం కోసం నిరంతరం అన్వేషిస్తూనే ఉన్నారు. ఇలాంటి వారి ఆకలిని తీర్చడానికి ఐక్యరాజ్యసమితి ఆహార భద్రత కోసం 1945 అక్టోబరు 16న 'ఆహార, వ్యవసాయ సంస్థ'ను ఏర్పాటు చేసింది. ఆహార వృథాను అరికట్టేందుకు ఉమ్మడి జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు కృషి చేస్తున్నాయి. టీఎన్‌బీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిర్యాల గూడ ఆర్టీసీ బస్టాండ్‌లో మిగిలిన ఆహార పదార్థాలను పెట్టేందుకు ఓ ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేక తొలగించారు. సూర్యాపేటలోనూ ఇదే పరిస్థితి. మిర్యాలగూడకు చెందిన ఆకుల కృష్ణంరాజు, అవిరెండ్ల సందీప్ మిత్రబృందాలు, నల్గొండకు చెందిన అమ్మ ఫౌండేషన్ రేఖ, ఆపద్బాంధవ ఫౌండేషన్ సంజు, చౌటుప్పల్‌కు చెందిన ఆయాన్ భార్గవ్ ట్రస్టు మురళి, సూర్యాపేటకు చెందిన మదర్ థెరిసా ఫౌండేషన్ జానీపాషా తదితరులు ఆహార వృథాను అరికట్టేందుకు శుభకార్యాల్లో



మిగిలిన ఆహారాన్ని సేకరించి పేదలకు పంచుతూ తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. దేశంలో ఒక్కో వ్యక్తి సగటున ఏటా 55 కిలోల ఆహారాన్ని వృథాగా పడేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోనే ఆహార వృథా అధికం. దేశంలో సుమారు 14.3శాతం మంది తగిన పోషకాలు అందక బాధ పడుతున్నారు. ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలకు పోషకాహార లోపమే కారణమని ఐసీఎంఆర్ హెచ్చరించింది. నిత్యం అనేక మంది ఆకలితో అలమటిస్తున్నారు. వారి ఆకలి తీర్చేందుకు గత ఏడేళ్లుగా నార్కట్‌పల్లి, పరిసర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆరు నెలల క్రితం 'మనం ఫౌండేషన్' పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించి నిత్యం వంద మందికి, సంత జరిగే శుక్రవారం 200 మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

# కాలువలు అధ్వానం.. సాగు ప్రశ్నార్థకం..!

ములుగు: 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా తయారైంది ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని పాలెంవాగు మధ్యతరహా జలాశయం పరిస్థితి. జలాశయంలో సమృద్ధిగా నీరున్నా సేద్యానికి నీరందని దైన్యస్థితి దాపురించింది. నీటిపారుదల శాఖ ముందు చూపు లేమి, నిర్మాణ పనుల్లో అంతులేని నిర్లక్ష్యం కర్షకుల పాలిట శాపమైంది. కాలువల అధ్వానస్థితితో నీరు పారడం గగనంగా ఉంది. ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారడంతో అన్నదాత గగ్గోలు పెట్టాల్సి వస్తోంది. నీటిపారుదలశాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణితో కోట్ల రూపాయల నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. ప్రాజెక్టుకు చెందిన నాలుగు కాలువలు, వెంకటాపురం-వాజేడు మార్గంలోని జెల్లాకాలనీ-ఆర్.గుంటపల్లి మధ్య ప్రధాన కాలువపై డీఎల్ఆర్‌బీ, పైపు కల్వర్టులు నిర్మాణాలు మూలుగుతున్నాయి. రూ.10 కోట్లు కేటాయించినా గుత్తేదారు సాకులు చెబుతూ.. కాలం వెల్లదీయగా, ప్రాజెక్టు యంత్రాంగం సైతం వంతపా డిందనే విమర్శలున్నాయి. ఏటా కడగండ్ల పాలవుతున్న ప్రధానమైన సమస్య డీఎల్ఆర్‌బీని సకాలంలో చేపట్టకపోవడంతో మళ్లీ అవే ఇబ్బందులు మొదలయ్యాయి. పిచ్చి మొక్కలు పెరిగి, మట్టి పేరుకుని దిగువకు నీరు పారకపోవడంతో బర్లగూడెం పంచాయతీలోని చిరుతపల్లి, పర్శికగూడెం, రామవరం, మిచ్చిగూడెం, జెల్లాకాలనీ, ఆర్.గుంటపల్లి ప్రాంతాల్లో వరి పొట్టదశలో ఎండుముఖం పట్టగా, మిర్చి సేద్యం ఆలస్యమవుతోంది. సాగునీటి కష్టాలను తీర్చాలని మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు రైతులు నివేదించారు. గత నెలలో ఈ ప్రాంతంలో



పర్యటించిన ప్రజాప్రతినిధులకు ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింహామూర్తి ఆధ్వర్యంలో రైతులు కష్టాలను విన్నవించారు. క్షేత్రస్థాయిలో సమస్యను సైతం చూపించారు. ఇన్నాళ్లైనా కాలువ కష్టాలు పరిష్కారానికి నోచుకోకపోవడం, అధికారులు సైతం అలసత్వం ప్రదర్శిస్తుండటంపై కర్షకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పిచ్చిమొక్కలు పెరిగి,పూడికమట్టితో నిండిన ఈ కాలువ వెంకటాపురం-వాజేడు మండలాల సరిహద్దులోని ఆర్.గుంటపల్లి చెంతనే ఉన్న పాలెంవాగు జలాశయంప్రధాన కాలువ. ఇక్కడి డీఎల్ఆర్‌బీ నిర్మాణం చేపట్టడంలో కాలాతీతం,పూర్వపు సిమెంట్ గొట్టాల్లో మట్టి పేరుకుపోవడంతో దిగువకు నీరుపారడం లేదు. దీంతో బర్లగూడెం పంచాయతీ పరిధిలోని 3 వేలకు పైగా ఎకరాల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

# సంత.. దళారుల సొంతం..!



కోదాడ :షెడ్లలో పశువులున్న ఈ చిత్రం కోదాడ సంతలోనిది. కొందరు దళారులు వీటిని ఇంట్లో కాకుండా సంతలోనే పెంచుతున్నారు. షెడ్లలో పశువులు ఉండటంతో రహదారి మీద జీవాల విక్రయాలు జరుగుతున్నాయి. వర్షాకాలం, ఎండాకాలం నీడ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన స్థలం లేకపోవడంతో ఏటా క్రయవిక్రయాలు తగ్గిపోతున్నాయి. కోదాడ అనగానే మొదటగా గుర్తొచ్చేది పశువుల సంత. ఉమ్మడి రాష్ట్రంలోనే ఓ వెలుగు వెలిగిన సంత నేడు మసకబారుతోంది. గతంతో పోల్చుకుంటే పశువుల విక్రయాలు 50 శాతానికి పైగా పడిపోయాయి. కోదాడకు ఆనుకొని ఉన్న సూర్యాపేట, మిర్యాలగూడ సంతలు ఏటా అభివృద్ధి చెందుతుంటే, కోదాడలో మాత్రం దిగజారిపోతోంది. దళారుల రాజ్యం నడుస్తుండటం, అధికారులు చూసీచూడనట్లు ఉండటంతో సంత ఆదరణకు నోచుకోవడం లేదు. ప్రతి శనివారం సంత నడుస్తుంది. పశువులు, మేకలు, గొర్రెల క్రయవిక్రయాలు జరిగిన తర్వాత అదే రోజు సంతను ఖాళీ చేయాలి. కొందరు దళారులు సంత షెడ్లలో పశువులను పెంచుతున్నారు. అక్కడే గడ్డి వాములు వేశారు. అక్కడి షెడ్లలో సుమారు 25 మంది దళారులు అక్రమంగా తమ పశువులను పెంచుతున్నారు. వీరిలో ప్రజాప్రతినిధులు ఉండటం విశేషం. రాజకీయ పలుకుబడి ఉపయోగించి, అధికారులను లెక్క చేయట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. పరిసరాలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వచ్చి రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల మేలు కోసం ఏర్పాటు చేసిన సంతలో ఇలా పశువులను పెంచడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా దళారులను బయటికి పంపి కోదాడ సంతకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. సంతలోని షెడ్లలో పశువులను పెంచుతున్న వారిని గుర్తించి అందరికీ మొదటి దఫా నోటీసులు జారీ చేసినా స్పందన లేదు. మరోసారి నోటీసులు జారీ చేసి, ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు చేపడతాం. రైతుల సౌకర్యార్థం షెడ్లను ఖాళీ చేయాలని ఇప్పటికే పలుమార్లు వారికి తెలియజేశాం. ఇప్పటికైనా షెడ్లను ఖాళీ చేసి, సంత అభివృద్ధికి సహకరించాలి.

# మిల్లర్ల సీఎంఆర్ మాయాజాలం!



జనగామ:రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి తిరిగి అప్పగించేందుకు ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రైస్‌మిల్లులకు ధాన్యాన్ని సరఫరా చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇచ్చిన ధాన్యాన్ని కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కింద తిరిగి మిల్లర్లు బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో గత, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కూడా మిల్లర్లు అప్పగించే విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నారు. జిల్లా కలెక్టర్ నుంచి మొదలుకొని రెవెన్యూ అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు నిత్యం సమీక్షిస్తూ సీఎంఆర్ గడువులోగా ఇవ్వాలనే నిబంధనలు విధిస్తున్నా పలు మిల్లుల యజమానులు ఇదేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గత వానాకాలంలో సీఎంఆర్ ధాన్యం మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాన్ని ఇంకా పూర్తి చేయలేదు. జిల్లా వ్యాప్తంగా 54 రైస్‌మిల్లులకు సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. అయితే రబీ సీజన్ ప్రారంభం అయినా కూడా గత వానాకాలం సీజన్‌లో ఇచ్చిన ధాన్యం కేవలం సగం మాత్రమే మిల్లర్లు సరఫరా చేయడంతో అధికార వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా, చలనం కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఖిలాషాపూర్, స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఓబుల్‌కేశ్వాపూర్, జఫర్‌గఢ్, కంచనపల్లి, కన్నెబోయినగూడెం, కుందారం తదితర ప్రాంతాల్లోని పలు రైస్‌మిల్లులు పెద్ద ఎత్తున బియ్యాన్ని సరఫరా చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పౌరసరఫరాల శాఖ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున సీఎంఆర్ బియ్యం పెండింగ్‌లో ఉంచే రైస్‌మిల్లర్లు ఒక సీజన్‌లో తమకు సరఫరా చేసిన ధాన్యాన్ని సొంత అవసరాలకు వినియోగించుకుంటూ అక్రమాలకు తెరదీస్తున్నారు. మరో సీజన్ ధాన్యం సరఫరా అయ్యే వరకు తిరిగి అదే రీతిన మొదటి సీజన్ పెండింగ్‌లో ఉంచుకుంటూ ప్రభుత్వానికి నత్తనడకన పంపిణీ చేస్తున్నారు. ఈ లెక్కన ఓ సీజన్ ధాన్యం మొత్తం ప్రతి ఏడాది మిల్లర్ల వద్దనే ఉంటున్నట్లు అధికారుల విచారణలో తేలింది. దీనికి తాజా ఉదాహరణ దేవరుప్పుల మండల పరిధిలోని ఓ మిల్లులో రూ.5.67కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు అధికారుల తనిఖీలో వెలుగు చూడటమే. దీంతో సదరు మిల్లు యజమానిపై అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేసి ఆస్తులు జప్తునకు నిర్ణయించారు. దశాబ్దాలుగా ప్రభుత్వ ధాన్యాన్ని భారీగా కొల్లగొడుతూ, రొటేషన్ దందా సాగిస్తున్న వారిపై అధికార యంత్రాంగం ప్రత్యేక కఠిన చర్యలు చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఏ సీజన్‌లో సరఫరా చేసే ప్రక్రియ ఆ సమయంలోనే ముగిసేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రజల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా దీర్ఘకాలంగా సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న రైస్‌మిల్లులపై కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు జరిపి, రికవరీ చేయబోతున్నాం. గడువులోగా ఇవ్వాలని మిల్లర్లకు తగిన ఆదేశాలు ఇచ్చాం. ఓ రైస్‌మిల్లు నిర్వాహకుడిపై ఇటీవల కేసు నమోదు చేశాం. ఇకపై నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు

నల్గొండ :నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయించనుంది. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లిస్తారు. దీని కోసం ప్రత్యేకంగా గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలోని సభ్యులు, అధికారులు సంయుక్తంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. ఇందిరమ్మ కమిటీల నియామకానికి అధికారులు గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహిస్తున్నారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 12 నియోజకవర్గాలు, 1784 గ్రామ పంచాయతీలున్నాయి. తొలి విడతలో భాగంగా జిల్లాకు 42 వేల ఇళ్లు మంజూరు చేస్తారు. గ్రామ పంచాయతీలు, పురపాలికల్లో వార్డు కమిటీల నియామకానికి అధికారులు కార్యాచరణ చేపట్టారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారికి ఇందిరమ్మ కమిటీల్లో చోటు కల్పించారు. ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున, పంచాయతీ కార్యదర్శి గ్రామ కమిటీల్లో భాగస్వాములవుతారు. పురపాలక సంఘాల పరిధిలో



వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున సభ్యులుగా ఉంటారు.
ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేసి నిధులు రాబట్టే అధికారం వీరికి ఉంటుంది. కమిటీ సభ్యులు పేద, మధ్య తరగతి వారై ఉండాలి. జాతీయ ఆహార భద్రత కార్డు తప్పనిసరి. అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం. సొంత ఇంటి జాగా కలిగి ఉండాలి.

# అద్దె భారం.. భవనాలకు తాళం

కరీమాబాద్ : వరంగల్ ఉర్సుగుట్ట డీకే నగర్ పక్కనున్న జ్యోతిబా పులే గురు కుల పాఠశాల/కళాశాలభవనానికి యాజమాని తాళం వేయడంతో బయటే ఉండిపోయిన అధ్యాపకులు తమకు రావాల్సిన భవనాల అద్దెలు చెల్లించాలని ప్రభుత్వానికి ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడంతో జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల భవనాలకు యజమానులు తాళాలు వేశారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేటు భవన యాజమాన్య సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఉదయం 7 గంటలకే వరంగల్ ఉర్సుగుట్ట డీకేనగర్ పక్కనున్న మహాత్మా జ్యోతిబా పులే గురుకుల పాఠశాల/కళాశాల భవనానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి బండి కుమారస్వామి తాళం వేశారు. దీంతో సుమారు 60 మందికి పైగా ఉన్న అధ్యాపకులు భవనం గేటు ముందే నిలబడిపోయారు. ప్రిన్సిపల్ అంజిరెడ్డి భవన యజమాని కుమారస్వామితో మాట్లాడినా.. ఆయన గేటు తాళం తీయలేదు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ గురుకుల సంస్థ కార్యదర్శి సైదులు భవన యజమాని కుమారస్వామితో ఫోన్‌లో మాట్లాడారు. అద్దె బకాయిలు చెల్లించడానికి దస్త్రాలు పంపించామని 10 రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సుమారు గంట తర్వాత గేటుతాళం తీశారు. దీంతో అప్పటి వరకు బయటే ఉండిపోయిన ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ గురుకు



లంలోకి వెళ్లారు. దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఎవరూ రాకపోవడంతో ఇబ్బంది కలగలేదు. ఈ సందర్భంగా గురుకుల కళాశాల ప్రిన్సిపల్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. భవనయజమానితో చర్చించాక సమస్య పరిష్కారమైందన్నారు. నేటి నుంచి యథావిధిగా తరగతులు సాగుతు న్నాయని వివరించారు. దుగ్గొండి మండలానికి సంబం ధించిన సాంఘిక సంక్షేమ బాలికలవసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. గత 18 నెలల నుంచి సుమారు రూ.45 లక్షల కిరాయి రావాల్సి ఉండటంతో వసతి గృహానికి తాళం వేసినట్లు యజమాని కంది గోపాల్‌రెడ్డి తెలిపారు.

## నల్గొండకు మహర్దశ

# బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్



నల్గొండ :నల్గొండ, సూర్యాపేట జిల్లాల ప్రజలు, వ్యాపారుల కల నెరవేరనుంది. జాతీయ రహదారి-565లో నకిరేకల్-నాగార్జున సాగర్ మార్గంలో నల్గొండ పట్టణం వద్ద బైపాస్ రోడ్డు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మహారాష్ట్రలోని సిరోంచ నుంచి మొదలు వయా నకిరేకల్, నల్గొండ, నాగార్జునసాగర్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల, ఎర్రగొండపాలెం, కనిగిరి, చిత్తూరు వరకు జాతీయ రహదారి నెంబరు 565 నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మూడు రాష్ట్రాలను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న ఈ జాతీయ రహదారిలో నల్గొండ పానగల్ కూడలి నుంచి 14 కి.మీ మేర నాలుగు వరసల బైపాస్ రహదారి నిర్మాణానికి రూ.516 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సోమవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదిక ద్వారా ప్రకటించారు. బైపాస్ నిర్మాణంతో వాహనదారులకు మరింత రవాణా సౌకర్యం మెరుగు పడనుంది. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల అనుసంధానానికి జాతీయ రహదారి-565 కీలకమైనది. ఈ దారిలో నాలుగు వరసల బైపాస్ నిర్మాణంతో నల్గొండ రూపురేఖలు మారనున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే పట్టణంలో వాహనాల రద్దీ తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్య తీరనుంది. నల్గొండ, చండూరు, మునుగోడు, కనగల్, గుర్రంపోడు, కొండమల్లేపల్లి, మాల్, సంస్థాన్ నారాయణపురం మండలాలకు రవాణా సౌకర్యం మరింత సులువుకానుంది. మేర నాలుగు వరసల బైపాస్ రహదారి నిర్మాణానికి రూ.516 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సోమవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదిక ద్వారా ప్రకటించారు. బైపాస్ నిర్మాణంతో వాహనదారులకు మరింత రవాణా సౌకర్యం మెరుగు పడనుంది. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల అనుసంధానానికి జాతీయ రహదారి-565 కీలకమైనది. ఈ దారిలో నాలుగు వరసల బైపాస్ నిర్మాణంతో నల్గొండ రూపురేఖలు మారనున్నాయి.నకిరేకల్-నాగార్జున సాగర్ దారిలో సురక్షితమైన ప్రయాణానికి దోహదం చేస్తుంది. నల్గొండ పురపాలిక పరిధిలో వెనుకబడిన ప్రాంతాలైన పాతబస్తీ, మామిళ్లగూడ, మర్రిగూడ, పానగల్, కతాలగూడ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. నకిరేకల్-మాచర్ల సెక్షన్ పరిధిలో నల్గొండ పట్టణంలో గత పదేళ్లుగా జాతీయ రహదారి విస్తరణ పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వానికి వ్యాపారులు మొర పెట్టుకున్నా ఆలకించే వారు కరవయ్యారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రూ.700 కోట్ల ప్రతిపాదనలతో బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరిన విషయం విదితమే. మంత్రి అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఫిబ్రవరిలో పచ్చజెండా ఊపింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బైపాస్ నిర్మాణానికి మూడు మార్గాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనల పంపించారు. అందులో పానగల్ ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం నుంచి వయా పానగల్, మర్రిగూడ మీదుగా హౌసింగ్‌బోర్డుకాలనీ, సంతోష్‌నగర్, కతాలగూడ, గంధవారిగూడెం, ఎస్ఎల్‌బీసీ మెడికల్ కళాశాల వరకు 14 కి.మీ. మేర నాలుగు వరసల బైపాస్ రోడ్డు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. రోడ్డు అలైన్‌మెంటు విడుదల కావడంతో నిర్మాణ పనులకు అవసరమైన కసరత్తు ప్రభుత్వ యంత్రాంగం చేపట్టింది. భూసేకరణకు అవసరమైన సర్వే ఇప్పటికే ప్రారంభమైంది. రెవెన్యూ అధికారులు ఎనిమిది కి.మీ మేర సర్వే పూర్తి చేశారు.

# భూమి గుణం తెలుసుకొని సాగితేనే రైతుకు మేలు



జగిత్యాల:ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తీరొక్క నేలలు కనిపిస్తాయి.. ఒక్కోచోట ఒక్కో రకం భూములు ఉన్నాయి.. గోదావరి తీర ప్రాంతంలో ఒండ్రు నేలలు అధికంగా ఉంటే.. మైదాన ప్రాంతాల్లో ఎర్ర, నల్లరేగడి భూములు అధికంగా ఉన్నాయి.. మరికొన్ని చోట్ల సౌడు భూములు కనిపిస్తాయి. అయితే ఉమ్మడి జిల్లాలో 70 శాతం ఎర్ర, నల్లరేగడి నేలలు, 20 శాతం సున్నపు నేలలు, మరో 10 శాతం ఇతర రకాలు ఉన్నాయి. మొత్తంగా 93 శాతం భూమిలో నత్రజని లోపం కనిపిస్తున్నది. 80 శాతం పాస్ఫరస్, 78 శాతం పొటాషియం అధికంగా ఉన్నది. నీటి సౌలత్ అధికంగా ఉండడంతో రైతులు వరి సేద్యానికే అధిక ప్రాధాన్యత ఇస్తు న్నారు. అయితే ఈ నేలల్లో వరి ఒక్కటే కాదు ఆరుతడి పంటలు పుష్కలంగా పండుతాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వాతావారణ పరిస్థితులు, భూసారం ఆధారంగా పంటలు వేస్తే మేలైన దిగుబడులు వస్తా యని, రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు. ఎర్రనేలలు అంతగా సారవంతమైనవికావు. తేలికగా ఉండి, గాలిపారాడేట్లు ఉంటాయి. పోష్టిక, సేంద్రియ పదార్థాలు తక్కువగా, భాస్వరం అధికంగా ఉంటుంది. ఐరన్ ఆక్సైడ్‌ను కలిగి ఉండడం వల్ల ఎరుపు రంగులో కనిపిస్తాయి. ఈ నేలల్లో ప్రధానంగా జొన్న, సజ్జ, పల్లి, ఆముదాల సాగుకు అనుకూలం. అయితే ఉమ్మడి జిల్లాకు గోదావరి నీటిని మళ్లించడం, 24 గంటల విద్యుత్ అందుబాటులోకి రావడం, ఇప్పటికే ఎస్సారెస్పీ, మిడ్‌మానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులు అందుబాటులో ఉండడంతో పుష్కలమైన నీటి వసతి ఏర్పడింది. దీంతో వరినే అధికంగా పండిస్తున్నారు. మారిన పరిస్థితుల్లో ఎర్రనేలల్లో ఆరుతడి పంటలను పండించాల్సిన అవసరం ఉందని పొలాస శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నీటి సౌకర్యం ఉన్న ప్రాంతంలో పల్లి, ఆముదం, పొద్దుతిరుగుడు, కంది, పెసర, మినుము, అలసంద, జొన్న, మక్క కుసుమ పంటలు, వర్షాధారితమైన ఎర్రనేలల్లో ఉలువలు, జొన్నలు వేయాలని సూచిస్తున్నారు. అర్ధ శుష్క పరిస్థితులు ఉండే దక్కన్ పీఠభూమిలో బసాల్ట్ శిలల శైథిల్యంతో నల్లరేగడి నేలలు ఏర్పడ్డాయి. మెత్తని ఇనుప పదార్థాలు ఉండడం వల్ల నల్లగా కనిపిస్తాయి. వీటిని చెర్నోజెమ్, రేగూర్‌గా పిలుస్తుంటారు. ఈ రకం భూములు నీటిని గ్రహించి ఎక్కువ కాలం నిల్వ చేసుకొనే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. వీటిలో ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, కార్బొనేట్, అల్యూమినియం పుష్కలంగా, నత్రజని, పాస్ఫారిక్ ఆమ్లం, సేంద్రియ పదార్థం తక్కువ మోతాదులో ఉంటాయి. పత్తి పంటకు అత్యంత అనుకూలమైనవి. అందుకే వీటిని బ్లాక్ కాటన్ సాయిల్స్‌గా పేర్కొంటారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో అత్యధికంగా విస్తరించి ఉన్నాయి.

# కలిసి పనిచేద్దాం..
# సుపరిపాలన అందిద్దాం:మంత్రులు

జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా పని చేసి ప్రజలకు సుపరిపాలన అందిద్దామని మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, అనగాని సత్యప్రసాద్ అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టులో కొట్టుకుపోయిన గేట్లను ఆగస్టులోగా తిరిగి అమర్చి జలాశయంలో నీటిని నిల్వ చేయాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం కలెక్టరేట్లో నిర్వహించారు. జిల్లాలో కీలక సమస్యలు, పరిష్కార మార్గాలపై కలెక్టర్ వెంకట మురళి ఆధ్వర్యంలో మూడు గంటలకుపైగా సమగ్రంగా చర్చించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టులో కొట్టుకు పోయిన గేట్లను యుద్ధప్రాతిపదికన అమర్చి జలాశయంలో నీరు నిల్వ ద్వారా సాగు, తాగునీరు అందించాలన్నారు. ఉచిత ఇసుక విధా నాన్ని జిల్లాలో సమర్థంగా అమలు చేయాలని, బినామీలు, అక్రమా ర్కులకు ప్రవేశం లేకుండా గట్టి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గుండ్లకమ్మ నదిలో అక్రమ ఇసుక తవ్వకాల వల్ల అద్దంకి పట్టణానికి తాగునీటి లభ్యత తగ్గిపోతోందన్నారు. అక్రమ తవ్వకాలను అరికట్టాలన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా కాలువలకు విడుదల చేసిన నీటితో ముందుగా గ్రామాలు, పట్టణాల్లో రక్షిత నీటి పథకాల చెరువులు నింపేలా పురపాలక, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. నీటి పథకాల నిర్వహణ రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చరాదన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ నిజాంపట్నం మండలం దిండిలో తొలిదశలో




రూ.88 కోట్లతో చేపట్టిన సమీకృత ఆక్వా పార్కు నిర్మాణానికి భూముల కేటాయింపుపై సీసీఎల్ఏ వద్ద పెండింగ్‌లో ఉన్న దస్త్రాన్ని వారం రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. వైకాపా ప్రభుత్వ పాలనలో కాలువ కట్టలను అక్రమంగా తవ్వేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమ స్యల పరిష్కార వేదికలో వచ్చిన వచ్చిన అర్జీలను నత్వరవే పరిష్కరిం చాలనిఆదేశించారు. బాపట్ల,రేపల్లె పట్టణాల్లో తాగునీటి సమస్య పరిష్కా రానికిరెండో చెరువు తవ్వకం, భూసేకరణకు ప్రతిపాదనలు రూపొందిం చాలన్నారు. అన్‌రిజిస్టర్డ్ భూముల్లో రొయ్యలు సాగు చేస్తున్న రైతులకు సాగు ధ్రువపత్రాలు మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. రేపల్లెలో జిల్లా ఆసుపత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశానికి చీరాల ఎమ్మెల్యే కొండయ్య మినహా అందరూ ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

# అతిసారం.. అప్రమత్తం



కాకినాడ: జిల్లాలో కొద్దిరోజులుగా అతిసారం కేసులు నిత్యం నమోదవుతూనే ఉన్నాయి. వాంతులు, విరోచనాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వర్షాకాలం నేపథ్యంలో ఈ పరిస్థితి మరికొన్నాళ్లు ఉండే అవకాశం ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. గత నెలలో తొండంగి మండలం కొమ్మనాపల్లి, బెండపూడిలో, సామర్లకోట మండలం వేట్లపాలెంలో భారీ సంఖ్యలో అతిసారం బారినపడ్డారు. రక్షిత తాగునీరు లేకపోవడం, మంచినీటి పైపులైన్ల లీకేజీలు, ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, విస్తారంగా వర్షాలు కురవడం తదితర కారణాలతో అతిసారం జడలు విప్పుతోంది. బుధవారం నాటికి కాకినాడ జీజీహెచ్‌లో 27 మంది అతిసారంతో బాధపడుతూ చికిత్సపొందు తున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి అతిసారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. మందులతో పాటు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. అతిసారంతో బాధపడుతున్న వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందజే స్తున్నారు. జిల్లాలో ఎక్కడైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎపిడమిక్ సెల్‌లోని 70939 30574, 72071 18051 నంబర్లకు సమాచారం అందించాలని వైద్యాధికారులు కోరుతున్నారు. బాలల్లో అతిసార మరణాలను పూర్తిగా నివారించేందుకు స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమాన్ని ఈ నెల 1 నుంచి వచ్చేనెల 31 వరకు రెండు నెలల పాటు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం మూడు దశల్లో జరగనుంది. జిల్లాలో రెండు నెలల లోపు పిల్లలు 4,320 మంది, 2-6 నెలలలోపు శిశువులు 7,683 మంది, ఆరు నెలల నుంచి అయిదేళ్లలోపు 1,34,375 మంది ఉన్నారు. స్టాప్ డయేరియాతో 1,46,378 మంది బాలలకు మేలు జరగనుంది.

# 31 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాయం!

కాకినాడ,:విచ్చలవిడిగా సాగిన గనుల దోపిడీకి ఇంకా అడ్డుకట్టప డలేదు. మట్టి, ఇసుక నిల్వలు గుట్టుగా తన్నుకుపోతున్నారు. కరప మం డలం ఉప్పలంకలో బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఖాళీ స్థలంలో ఇసుక నిల్వ కేంద్రం ఉంది. ఇక్కడ 31 వేల మెట్రిక్ టన్నుల వరకు నిల్వలు ఉండేవి. రాత్రికి రాత్రి యంత్రాలు, లారీలు తీసుకొచ్చి తరలించేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ నిల్వ కేంద్రం ప్రతిమ సంస్థ నిర్వహించేది. కాకినాడ నగరం, గ్రామీణ ప్రజల నిర్మాణ అవసరాలకోసం ఇక్కడ విక్రయించేవారు. ఎన్నికల తర్వాత కూడా రూ.కోట్ల విలువైన నిల్వలు దర్శనమిచ్చాయి. ఇటీవల అవి మాయమైనా ఎవరూ స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమ తరలింపు వ్యవహారం భూగర్భ గనులు, రెవెన్యూ, ఇతర శాఖల దృష్టికి వెళ్లినా గుంభనంగా ఉన్నారు. తాజాగా ప్రభుత్వం ఉచిత ఇసుక పం పిణీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ కేంద్రాన్ని జాబితాలోంచి తొలగించి కాకినాడ జిల్లాలో పెద్దాపురంలో మాత్రమే నిల్వలు ఉ న్నట్లు చూపారు. ప్రైవేటు నిల్వ కేంద్రాల సంగతో: ఇన్నాళ్లూ అక్రమ



ఇసుక తవ్వకాలు, తరలింపులతో వైకాపా ప్రభుత్వంలో కొందరు రూ.కోట్లలో ఆర్జించారు. కాకినాడ, గ్రామీణంలో వీరు నిర్ణయించిన ధరకే కొనాల్సి వచ్చేది. ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. గతంలోఇసుక వ్యాపారానికి అలవాటుపడ్డ కొందరు నాయకులు ప్రభు త్వంనిర్ణయించిన నామమాత్రపు ఛార్జీలతో సంబంధం లేకుండా ఇక్కడ అమ్ముతున్నారు. వ్యక్తిగత అవసరాల పేరుతో అక్రమ నిల్వలు పోగుచేసి అధిక ధరలకు సొమ్ముచేసుకుంటున్నా చర్యలు లేవు.

# స్థలాల క్రమబద్ధీకరణపై కదలిక

మహబూబాబాద్:నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్న స్థలాల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)పై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన ప్రకటనతో దరఖాస్తుదారుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. గత ప్రభుత్వం 2020లో స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరించడంతో జిల్లాలోని నాలుగు పురపాలక సంఘాల్లో సుమారు 25 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుదారుడి నుంచి రూ. వెయ్యి చొప్పున దరఖాస్తు స్వీకరణ రుసుం తీసుకున్నారు. దీంతో పురపాలక సంఘాలకు రూ. 2.60 కోట్లు జమ అయ్యాయి. లే-అవుట్ అనుమతులు లేని స్థల కొనుగోలుదారులు



విధిగా క్రమబద్ధీకరించుకోవాలని గత ప్రభుత్వం రెండోసారి అవకాశం ఇచ్చింది. అత్యవసరమనుకున్నవారు మాత్రం అధికారులు సూచించిన విధంగారుసుం చెల్లించి వాటిని క్రమబద్ధీకరించుకున్నారు. నాలుగు పురపా లక సంఘాల్లో వేలల్లో దరఖాస్తులు రాగా వందల్లో కూడా క్రమబద్ధీకరణ కాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ ప్రత్యేక బృందంతో పరిశీలించి వాటిపై చర్యలు తీసుకోవాలని సూచించ డంతో మళ్లీ ఆ దస్త్రాల్లో కదలిక వచ్చింది. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, పురపాలక సంఘం పట్టణాభివృద్ధి విభాగం అధికారుల బృందం పరిశీలిం చి తాజాగా ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల మేరకు ఆ స్థలాలను క్రమబద్ధీకరించనుంది. ఈ స్థలాలను క్రమబద్ధీకరిస్తే ఆయా పురపాలక సంఘాలకు సుమారు రూ. 10 నుంచి రూ. 15 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. స్థల యజమానులు కూడా తమ సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనలను అనుసరించి స్థలాల క్రమబద్ధీకరణ చేపడుతామని మహబూబాబాద్ టీపీవో టి.సాయిరాం పేర్కొన్నారు. ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములు, చెరువులు, కుంటల శిఖం భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ప్రాంతాలను మినహాయించి ఇతర స్థలాలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడులు

పరకాల, : పరకాల ఉమ్మడి మండల వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద మొత్తం లో పీడీఎస్ బియ్యాన్ని, పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల పట్టణం, నడికూడ మండలంలోని చర్లపల్లి గ్రామంలో అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. నడికూడ మం డలం చర్లపల్లిలో నిర్వహించిన దాడుల్లో రూ. 9.5లక్షల విలువ చేసే 360 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, డీసీఎంను స్వాధీనం చేసుకుని, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో తూర్పాటి ఐలయ్య, నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన బండి శంకర్, బండి కుమార్‌తో పాటు పరకాల మండలం కామారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కొమ్మిడి మధూకర్ రెడ్డి ఉన్నారు. దీంతో పాటు రూ. 1.58లక్షల విలువ చేసే గుట్కాలను రేపాల చంద్రశేఖర్ గుప్తా నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా, స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని, పొగాకు ఉత్పత్తులను, డీసీఎంను స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు.

# రైతుల రిటర్నబుల్ ప్లాట్లలో..
# మౌలిక వసతుల కల్పనకు అధ్యయనం

అమరావతి:అమరావతి నిర్మాణం కోసం తమ విలువైన భూములను త్యాగం చేసిన రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రెండేళ్ల కిందట వైకాపా ప్రభుత్వం.. కోర్టు ధిక్కరణను తప్పించుకునేందుకు పనులు ప్రారంభించి కొంత మేర కంప తొలగించింది. ఆనక.. జంగిల్ క్లియరెన్స్ పనులు నిలిపివేసింది. ఫలితంగా కనుచూపు మేర ప్లాట్లలో విపరీతంగా కంప చెట్లు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. దీంతో ప్లాట్లను రైతులు అమ్మకాలు సాగించేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు సీఆర్డీఏ అధికారులు దృష్టి సారించారు. తక్షణం ఎల్పీఎస్ లేఔట్లలో చేపట్టాల్సిన పనులపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. తమకు కేటాయించిన ప్లాట్లలో కంప తొలగించి, వాటిని అభివృద్ధి చేసి ఇవ్వాలని రైతులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. అవసరాల కోసం అమ్ముకుందామన్నా అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్లలోకి అడుగుపెడదామన్నా వీలు కాని పరిస్థితి నెలకొంది. హద్దులు కూడా కనిపించనంతగా ముళ్ల కంపలు పెరిగాయి. ఈ నేపథ్యంలో 24 ఎల్పీఎస్ లేఔట్లలో మౌలిక వసతులను అభివృద్ధి చేసే పనిలో సీఆర్డీఏ అధికారులు నిమగ్నమయ్యారు. అన్ని లేఔట్లలో సమీకృత మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని తలపోస్తున్నారు. ఇందుకు గాను 217.23 చదరపు కి.మీ. విస్తీర్ణాన్ని 13 లేఔట్లుగా విభజించారు. 1,281 కి.మీ నిడివితో రోడ్లు, స్టామ్ వాటర్ డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, విద్యుత్తు, కమ్యునికేషన్ల డక్ట్‌లు ఉండేలా ప్రణాళికలు రచించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నిధుల కొరత పేరుతో ప్రణాళికలను కుదించారు. కుదించినవి కాకుండా బృహత్ ప్రణాళికలో పేర్కొన్న విధంగానే పనులు చేపట్టాలని అధికారులు యోచిస్తున్నట్లు తెలిసింది. సర్వే అనంతరం వీలైనంత త్వరలో పనులు ప్రారంభించే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. రాజధాని కోసం తెదేపా ప్రభుత్వం 34 వేల ఎకరాలను రైతుల నుంచి పూలింగ్‌లో తీసుకుంది. ఇందుకు



ప్రతిగా రైతులకు అభివృద్ధి చేసిన నివాస, వాణిజ్య ప్లాట్లను ఇవ్వనున్నట్లు వారితో ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా రైతులకు 64 వేలకు పైగా ప్లాట్లను కేటాయించింది. 40 వేలకు పైగా ప్లాట్లను 2019 నాటికే రిజిస్టర్ కూడా చేశారు. రైతులకు అన్ని వసతులతో ప్లాట్లను అభివృద్ధి చేసి ఇవ్వాలని ఏపీ హైకోర్టు 2022లో తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో మౌలిక వసతుల పనుల కోసం రూ.16,400 కోట్ల అంచనాలతో 13 జోన్లుగా విభజించి సీఆర్డీఏ టెండర్లు పిలిచింది. 11 జోన్లకు సంబంధించి టెండర్లను ఖరారు చేసి, గుత్తేదారులను ఎంపిక చేశారు. ప్లాట్లలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పన కోసం అని ప్రారంభించారు.

కొద్ది విస్తీర్ణంలో ముళ్ల కంపలు తొలగించి, తర్వాత పనులు ఆపేశారు. పనులకు సంబంధించి ఫొటోలు తీసి, ముమ్మరంగా సాగుతున్నట్లు వాటినిసుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం జతచేసింది. కంప తొలగించిన ప్రాంతాల్లో మళ్లీ దట్టంగా పెరిగాయి. పనుల కోసం సీఆర్డీఏకు వైకాపా ప్రభుత్వం అప్పట్లో రూ.3,500 కోట్లకు రెండేళ్ల వ్యవధితో కూడిన రుణం కోసం గ్యారెంటీ ఇచ్చి చేతులు దులుపుకొంది. ఆ తర్వాత ఎటువంటి చొరవ చూకపోవడంతో రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు ఆసక్తి చూపలేదు.

# కడా ప్రాజెక్టుకు పూర్వ వైభవం..!

కుప్పం : సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టించి, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ, సమీక్షలకు వేదికగా ప్రాజెక్టు పునర్ ప్రారంభానికి ప్రభుత్వం నిర్ణయించింది. తదనుగుణంగా ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా ఇది వరకు విధులు నిర్వర్తించిన వికాస్ మర్మట్‌ను కడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రభుత్వ నియమించింది. 2019వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఆయన. పీడీగా త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన ఆధ్వర్యంలోనే పనులు సాగనున్నాయని అధికారులు చెబుతున్నారు. కుప్పం పురపాలికతో పాటు కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వేగవంతంలో 'కడా' కీలకంగా మారనుంది. ప్రజా సమస్యల పరిష్కారానికి వారధిగా నిలవనుంది. అభివృద్ధి ప్రణాళిక రూపకల్ప, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఆర్‌అండ్‌బీ, నీటి పారుదల, విద్యుత్తు, గ్రామీణాభివృద్ధి, డ్వామా, అటవీ, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉద్యానం, పశుసంవర్ధక, హౌసింగ్, నిత్యావసరాలు, ఐసీడీఎస్ తదితర శాఖల తోపాటు అన్ని సంక్షేమ విభాగాల్లో కార్యక్రమాల అమలు, అధికారుల విధులు, బాధ్యతలపైట్క పర్యవేక్షణ, సమీక్షల అధికారాన్ని పీడీకి అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అభీష్టం మేరకు పునర్ ప్రారంభం కానున్న కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో పరుగులు తీయడం ఖాయమని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కుప్పం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 1995లోనే ప్రాజెక్టుకు శ్రీకారం



చుట్టారు. అప్పట్లో డీఆర్‌డీఏ పీడీ, సబ్ కలెక్టర్ స్థాయి అధికారులను ప్రాజెక్టు అధికారులుగా (పీఓ) కొనసాగారు. 2004 వరకు కొనసాగిన కడను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసింది. చంద్రబాబు మూడో దఫా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి తర్వాత 2014లో మళ్లీ పునరుద్ధరించారు. ఐదేళ్ల పాటు ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేశారు. వైకాపా హయాంలో ఆ ప్రాజెక్టుకు అటకెక్కించారు. కుప్పం పట్టణంలో ఏర్పాటు కానున్న కార్యాలయంలో పీడీతోపాటు 19 మంది అధికారులు, సిబ్బంది ఉండనున్నారు. అదనపు పీడీ (డిప్యూటీ కలెక్టర్ స్థాయి), తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు సీనియర్ సహాయకులు, ఇద్దరు జూనియర్ సహాయకులు డిప్యుటేషన్‌పై నియమితులు కానున్నారు. ఈ ప్రక్రియ కలెక్టర్, కడా డైరెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇద్దరు పీఎంయూ సిబ్బంది, నలుగురు అటెండర్లు, ఇద్దరు కాపలాదారులు, ఇద్దరు డ్రైవర్లను పొరుగు సేవల విధానంతో ప్రభుత్వం నియమించనుంది

# నిబంధనల అమలెక్కడఅడ్డగోలుగా పోస్టింగ్‌లు




చిత్తూరు :ఆయన నిబంధనలు పట్టించుకోరు.. తెలిసినా తనకే 'లాభం' లేనిదే అసలు వినరు.. ఇలా నిబంధనలు ఒప్పుకోకున్నా తనకిష్టమైన వారిని.. ఇష్టమైనచోట నియమించేసుకున్నారు.. సమగ్ర శిక్షలోని ఖాళీగా ఉన్న సెక్టోరియల్ అధికారుల పోస్టులకు పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు.. గత ప్రభుత్వంలో పనిచేసిన సెక్టోరియల్ అధికారులు ఆ పోస్టుల నుంచి తప్పుకోవడంతో వాటిలో పనిచేసేందుకు పలువురు ఆసక్తి చూపడంతో పోటీ తీవ్రమైంది.. జిల్లాల విభజన తర్వాత సెక్టోరియల్ అధికారుల్లో కీలక పోస్టులు తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు వెళ్లిపోయాయి.. ఇక్కడ ఎక్కువగా సహాయాధికారుల పోస్టులు ఉన్నాయి.. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న కుప్పం, నగరి నియోజకవర్గాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు ఈ పోస్టుల కోసం ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను దరఖాస్తుతో జత చేయడం గమనార్హం. వైకాపా హయాంలో పనిచేసిన సెక్టోరియల్ అధికారులు మళ్లీ పాఠశాలలకు వెళ్తుండటంతో అన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఏఎంవో), అసిస్టెంట్ కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ (ఏసీఎంవో), ప్లానింగ్ కో-ఆర్డినేటర్, సహిత విద్య సమన్వయకర్త, ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్తలతో పాటు మూడు సహాయ గణాంకాధికారుల పోస్టుల కోసం ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల కోసం తిరుగుతున్నారు. సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీ చేయాలంటే నోటిఫికేషన్ విడుదల చేయాలి. ఎక్కువ దరఖాస్తులు వస్తే పరిశీలించి అర్హుల జాబితా విడుదల చేయాలి. ఒక పోస్టుకు ఎక్కువ దరఖాస్తులు వస్తే కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి ఇంటర్వ్యూలు నిర్వహించాలి. అలా ఎంపిక చేసిన జాబితాను రాష్ట్ర ఎస్పీడీ ఆమోదానికి పంపి అనుమతి వచ్చాక నియామక ఉత్తర్వులు అందజేస్తారు. సెక్టోరియల్ అధికారులుగా పనిచేసినవారు మళ్లీ హెచ్ఎంగా గానీ.. ఉపాధ్యాయుడిగా గానీ గతంలో పనిచేసి వచ్చిన పాఠశాల సమీపంలోనే పనిచేయాలనే నిబంధన ఉంది. ఇప్పుడు రిలీవ్ అయిన వారిలో ఒకరికి ఇందుకు విరుద్ధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు పోస్టింగ్ ఇచ్చారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఆ అధికారి గతంలో తవణంపల్లె మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా పాఠశాలల హేతుబద్ధీకరణలో ఆ పోస్టు ఖాళీ అయి కుప్పానికి వెళ్లింది. దీంతో సెక్టోరియల్ అధికారిగా వైకాపా పాలనలో వచ్చారు. ఇప్పుడు రిలీవ్ అయితే పాఠశాల కేటాయింపు ఆ మండలం గానీ సమీప మండలాలు గానీ లేదా డివిజన్ పరిధిలో పోస్టింగ్ ఇవ్వాలనేది నిబంధన. అయితే ఉన్నతాధికారులు అవేమీ పట్టించుకోకుండా తిరుపతి జిల్లా పాకాల మండలం దామలచెరువులో పోస్టింగ్ ఇచ్చారని సమాచారం. నిబంధనలు పాటించలేదని పలువురు ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు.

# అమలుకాని నిషేధం..ఆగని ప్లాస్టిక్ వినియోగం

భైంసా:పాలిథిన్ ప్రభావంతో ప్రజలు, ఇతర జీవాల ఆరోగ్యానికి నష్టదాయకమని గుర్తించిన ప్రభుత్వం వాటి వినియోగాన్ని నిషేధించిం ది. వాటితో తయారయ్యే వస్తువుల వ్యర్థాలతోనూ పర్యావరణం దెబ్బతిని ప్రకృతి వైపరిత్యాలకు దారితీస్తోంది. పాలిథ్విన్ వాడకంతో ఎ దురయ్యే అనర్థాలపై అవగాహన కల్పించినా జనంలో మార్పు రావ డం లేదని పర్యావరణ హితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు ఉండడంతో అవగాహన లేక వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం యోగక్షేమం కాదని తెలిసినా పట్టణ వాసులు, విద్యావంతులు, ఉద్యోగులు అదే బాటలో వెళ్తున్నా రు. మార్కెట్‌నుంచి వస్తువులు, సరకులను దుకాణ దారులు ఇచ్చే ప్లాస్టిక్ సంచుల్లో తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. మరోవైపు హోటళ్లు, కర్రీ పాయింట్‌ల నుంచి వేడి ఆహార పదార్థాలు, కూరలు, సాంబారు, ఛాయ్, కాఫీలను పాలిథ్విన్ పొట్లాల్లో తెచ్చుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. 2022 జులైలో 75 మైక్రాన్ల లోపు ప్లాస్టిక కవర్లను ప్రభుత్వం నిషేధించగా డిసెంబరులో 121 మైక్రాన్ల ఉత్పత్తులను నిషేధిత జాబితాలో చేర్చింది. అమలులో అధికారులు మొక్కుబడిగా ఒకటి రెండు సమావేశాలు సారించక పోవడంతో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం కొనసాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల తనిఖీలు, జరిమానాలు నామమాత్రమే అయ్యాయి. పాలిథిన్ నిషేధంపై అధికారులు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకొచ్చి ఉద్యమంలా ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరముంది.

# గసగసాలతో గంపెడు ప్రయోజనాలు..

## వీటితో ఎన్నో సమస్యలు పరార్?



సాధారణంగా అందరి వంటింట్లో మసాలా దినుసులు తప్పకుండా ఉంటాయి. ఇవి వంటలకు రుచి అందించడమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగిస్తాయి. మసాలా దినుసుల్లో ఒకటి గసగసాలు. ఇవి మంచి పోషక విలువలను కలిగి ఉంటాయి. రోజు వారి ఆహారంలో భాగంగా గసగసాలను చేర్చుకోవడం అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. శరీరంలోని కణాల వాపు తగ్గడానికి, గుండె ఆరోగ్యం పనితీరు మెరుగుపరచడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇన్ని లాభాలు ఉన్న గసగసాల గురించిన మరిన్ని ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

భారతీయులు గసగసాల ప్రత్యేకత తెలుసు. వంట రుచిని ఇవి మార్చేస్తాయి. గసగసాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వంటగదిలో గసగసాలు అందరికీ సుపరిచితమే. కానీ గసగసాలు వంట చేయడానికి మాత్రమే ఉపయోగపడతాయనుకుంటాం.. కానీ గుండె జబ్బులు, జీర్ణక్రియ, జుట్టు, చర్మ సమస్యలు, నిద్రలేమి, మధుమేహం, ఎముక అసాధారణతలు, నరాల సమస్యలు వంటి అనేకవ్యాధులకు చికిత్స చేసే ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటాయి గసగసాలలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు, పోషకాహారాలు ఉన్నాయి. 100 గ్రాముల మొత్తం గసగసాలలో కింది పోషకాలు ఉంటాయి.. పోషకాల మొత్తం శక్తి 536 కేలరీలు, ప్రోటీన్ 21.43 గ్రాములు, లిపిడ్ (కొవ్వు) 39.29 గ్రా, కార్బోహైడ్రేట్ 28.57 గ్రాములు, ఫైబర్ 25 గ్రాములు, చక్కెర 3.57 గ్రాములు, కాల్షియం 1,250 మిల్లీగ్రాములు, ఐరన్ 9.64 మి.గ్రా, మెగ్నీషియం 357 మి.గ్రా, జింక్ 8.04 మి.గ్రా ప్రధానంగా 3 రకాల గసగసాలు ఉన్నాయి. అవి తెల్ల గసగసాలు (వంట కోసం ఉపయోగించే ఆసియా లేదా భారతీయ గసగసాలు అని పిలుస్తారు), బ్లూ గసగసాలు (యూరోపియన్ గసగసాలుగా పిలుస్తారు, బ్రెడ్, ఇతర మిఠాయిలో ఉపయోగిస్తారు), ఓరియంటల్ గసగసాలు (ఓపియం గసగసాలు అని పిలుస్తారు.

**నిద్రలేమి నుండి ఉపశమనం :** గసగసాలలో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తుంది. ఒత్తిడి ఉపశమనం, ప్రశాంతమైన నిద్రకు దారితీస్తుంది. పడుకునే ముందు పాలలో గసగసాల టీ లేదా గసగసాల పేస్ట్ వేసి తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం పెరిగి నిద్ర వస్తుంది. ఇది నిద్రలేమి వంటి సమస్యను నయం చేస్తుంది.

**మహిళల్లో వంధ్యత్వం :** స్త్రీలలో వంధ్యత్వాన్ని నివారించడంలో గసగసాలు, దాని నూనె చాలా మేలు చేస్తాయి. టైడ్ ఫెలోపియన్ ట్యూబ్స్ ఫలదీకరణ గుడ్డు గర్భాశయ గోడకు అటాచ్ చేయకుండా నిరోధిస్తుంది. గసగసాలతో ఫెలోపియన్ ట్యూబ్‌లను ఫ్లష్ చేయడం ద్వారా,ఏదైనా శిధిలాలు లేదా శ్లేష్మ కణాలు కరిగి, అడ్డంకిని తొలగిస్తాయి. తద్వారా సంతానోత్పత్తి అవకాశాలు పెరుగుతాయి. గసగసాలలోని నార కామోద్దీపన లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది లిబిడోను పెంచుతుంది. లైంగిక జీవితాన్ని మెరుగుపరుస్తుంది.

**జీర్ణక్రియలో సహకరిస్తుంది :** ఫైబర్ పుష్కలంగా ఉండే గసగసాలు జీర్ణక్రియను ప్రోత్సహించడానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఇది ఆహారం నుండి పోషకాలను గ్రహించడాన్ని పెంచుతుంది. ఇది మలబద్ధకాన్ని నయం చేస్తుంది. మలద్వారం ద్వారా వ్యర్థ పదార్థాలను సులభంగా వెళ్లేలా చేస్తుంది.

**గ్రహణ సామర్థ్యాన్ని పెంపొందించడం:** గసగసాలలో ఐరన్ పుష్కలంగా ఉన్నందున, అవి సహజంగా రక్తాన్ని శుద్ధి చేస్తాయి. రక్తంలో ఎర్ర రక్త కణాలు,హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతాయి. మెదడుకు ఆక్సిజన్, ఎర్ర రక్త కణాల తగినంత సరఫరా న్యూరోట్రాన్స్మిటర్ల ఉత్పత్తిని నియంత్రించడానికి, అభిజ్ఞా శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. దీని ద్వారా మతిమరుపు వంటి సమస్యలు తగ్గుతాయి.

**గుండెను ఆరోగ్యంగా ఉంచడం:** గసగసాలు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి.మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. ఇందులోని ఒలీక్ యాసిడ్ రక్తపోటును తగ్గిస్తే, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్ గుండెకు మరింత మేలు చేస్తుంది. ఇది గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం:** గసగసాలలో ఖనిజాలు, జింక్ పుష్కలంగా ఉన్నాయి. ఇవిఎముక ఖనిజ సాంద్రతను పెంచుతాయి, ఎముకలు,బంధన కణజాలాలను బలోపేతం చేస్తాయి. ఎముక పగుళ్ల నుండి రక్షిస్తాయి. ఇందులోని మాంగనీస్ ఎముకలలో కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. తద్వారా ఎముకలు దెబ్బతినకుండా కాపాడుతుంది.

**చర్మం, జుట్టు ఆరోగ్యం :** గసగసాలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. చర్మం, జుట్టు మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అలాగే చర్మం మంట, స్కాల్ప్ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గసగసాలలోని అధిక మొత్తంలో లినోలిక్ యాసిడ్ దురద, కాలిన గాయాలు, స్క్రాప్‌ల చికిత్సలో చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. గసగసాల పేస్ట్‌ను ఫేస్ మాస్క్‌గా ముఖానికి అప్లై చేయడం వల్ల మొటిమలు తొలగిపోయి, శుభ్రమైన, మెరిసే చర్మాన్ని అందిస్తాయి. మీ అందాన్ని మెరుగుపరుస్తుంది.

బరువు తగ్గేందుకు..బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా గసగసాలు తినాలి.గసగసాలలో ప్రొటీన్, ఫైబర్, ఎనర్జీ, కార్బోహైడ్రేట్స్, ఐరన్, కాల్షియం, జింక్, విటమిన్ బి-6, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్, మెగ్నీషియం, ప్రొటీన్ వంటి పోషకాలు ఉన్నాయి. గుండె, జీర్ణవ్యవస్థ, జుట్టు, చర్మం, నిద్రలేమి, మధుమేహం, ఎముకలు, నరాల సమస్యలతో సహా అనేక వ్యాధులలో ఇది ప్రభావవంతంగా ఉంటుంది.

**ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది:** గసగసాలలో కాల్షియం ,కాపర్ ఎక్కువగా ఉంటాయి. మీ ఎముకలు బలహీనంగా ,నొప్పిగా ఉంటే గసగసాలు తినడం మంచిది. గసగసాలు ఎముకలను బలపరుస్తాయి. ఇందులోని మాంగనీస్ ప్రొటీన్ కొల్లాజెన్ ఏర్పడటానికి సహాయపడుతుంది. ఇది తీవ్రమైన ఎముక నష్టాన్ని నివారించవచ్చు.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది :** గసగసాలలో బయోయాక్టివ్ పదార్థాలు ,యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని రక్షిస్తుంది. బలమైన యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ లక్షణాలతో, జింక్ జ్వరం, చలి, గొంతు నొప్పి ,ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌లను నివారించడంలో అత్యంత ప్రభావవంతమైనది. జీర్ణక్రియను మెరుగుపరచడానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. గసగసాలలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.

# మరో రైలు ప్రమాదానికి భారీ కుట్ర..?

## ట్రాక్‌పై బరువైన సిమెంట్ దిమ్మెలు



ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రైలు పట్టాలపై సిలిండర్ పెట్టి రైలును పట్టాలు తప్పించేందుకు దుండగులు యత్నించిన ఘటన మరవక ముందే అలాంటి ఘటనే తాజాగా మరొకటి చోటు చేసుకుంది. రాజస్థాన్‌లోని అజ్మీర్ లో రైలు ప్రమాదానికి దుండగులు భారీ కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఫులేరా -అహ్మదాబాద్ రూట్‌లో రైలు ట్రాక్‌పై దుండగులు సుమారు 70 కేజీల బరువైన సిమెంట్ దిమ్మెనుఉంచారు. దీంతో రైలు సిమెంట్ దిమ్మెను ఢీ కొట్టుకుంటూ ముందుకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో రైలు ఇంజిన్‌తోపాటు కొంత భాగం దెబ్బతిన్నది. ఈ ఘటనపై లోకో పైలట్ ఆర్పీఎఫ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రమాద ప్రాంతంలో విరిగిన సిమెంట్ దిమ్మె భాగాలను గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, రెండురోజుల క్రితం యూపీలో భివాండి-ప్రయాగ్‌రాజ్ కాళిందీ ఎక్స్‌ప్రెస్‌కు కాన్పూర్‌లో పెను ప్రమాదం తప్పిన విషయం తెలిసిందే. ట్రాక్‌పై ఉంచిన గ్యాస్ సిలిండర్‌ను రైలు ఢీకొంది. అయితే రైలుకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. రైలును పట్టాలు తప్పించడానికి జరిగిన విద్రోహ చర్యగా దీనిని భావిస్తున్నామని, ఘటనా స్థలిలో ఒక పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టెను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి 8.20 గంటలకు రైలు అతివేగంతో వెళ్తుండగా, పట్టాలపై ఎల్పీజీ సిలిండర్ ఉండటాన్ని గమనించిన లోకో పైలెట్ ఎమర్జెన్సీ బ్రేకులు ప్రయోగించారు. అయినప్పటికీ రైలుసిలిండర్‌ను ఢీకొనడంతో అది పట్టాలకు దూరంగా ఎగిరిపడింది. ఘటనపై కేసు నమోదైందని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీస్ అధికారి చెప్పారు.

# కంటి ఆరోగ్యం జాగ్రత్త



అత్యంత ప్రధానమైనవే అయినప్పటికీ రోజువారీ పనుల్లో పడిపోయి కండ్ల ఆరోగ్యం గురించి మనం అంతగా పట్టించుకోం. అయితే, గంటల తరబడి డిజిటల్ తెరలకు అతుక్కుపోవడం, బల్బుల కాంతిలో గడపడం, ఆధునిక జీవనశైలి మన కండ్ల ఆరోగ్యానికి హాని చేస్తున్నాయి. మొదట్లో ఏమంత ఇబ్బందిగా అనిపించకపోయినా ఈ అలవాట్లు దీర్ఘకాలంలో కంటి సమస్యలకు అంటుకడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కంటి సమస్యలకు కారణమయ్యే కొన్ని అలవాట్ల పట్ల శ్రద్ధ చూపాలని సలహా ఇస్తున్నారు.

**డిజిటల్ తెరల దెబ్బ:** స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల తెరలను గంటల తరబడి చూస్తుండటంతో కండ్లు ఒత్తిడికి గురవుతాయి. దీంతో పొడిబారడం, మంట, చూపులో సమస్యలు మొదలైనవి తలెత్తుతాయి. ఇవన్నీ అలా ఉంచితే తెరల నుంచి సోకే బ్లూ లైట్ మన నిద్రా చక్రం మీద దుష్ప్రభావం చూపుతుంది. డిజిటల్ పరికరాల వాడకం తప్పనిసరి కాబట్టి, 20 20 20 నియమాన్ని పాటించాలి. ప్రతి ఇరవై నిమిషాలకోసారి ఇరవై సెకండ్లు విరామం తీసుకోవాలి. ఓ ఇరవై అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడటమే ఈ విధానం. చిన్నపిల్లలు అదేపనిగా డిజిటల్ తెరలకు అతుక్కుపోతే హ్రస్వదృష్టి సమస్య తలెత్తుతుంది. కాబట్టి, ఆరుబయట ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

**సమస్య నిర్లక్ష్యం:** తలనొప్పి, ఎక్కువ రోజులు కండ్లు పొడిబారడం, అలసిపోయినట్టు ఉండటం మొదలైనవి తీవ్రమైన కంటి సమస్యలకు తొలి సంకేతాలు. వీటిని నిర్లక్ష్యం చేస్తే మరిన్ని సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి కండ్లలో అసౌకర్యంగా ఉన్నా, చూపులో ఇబ్బందిగా అనిపించినా కండ్ల డాక్టర్‌ను సంప్రదించడం మంచిది. నిర్లక్ష్యం చేయకూడదు.

**రక్తంలో చక్కెర.. రక్తపోటు:** ఆరోగ్యకరమైన శరీరంతోనే ఆరోగ్యకరమైన కండ్లు సాధ్యమవుతాయి. ఒకవేళ మధుమేహం, అధిక రక్తపోటు ఉంటే కండ్ల మీద దుష్ప్రభావం పడుతుంది. మధుమేహ రోగుల్లో కంటి శుక్లాలు, గ్లకోమా, డయాబెటిక్ రెటినోపతీ, కంటి ఇన్ఫెక్షన్లు తలెత్తే ముప్పు ఎక్కువ. కాబట్టి రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయులు, కొలెస్ట్రాల్ స్థాయులను అదుపులో పెట్టుకోవడం అత్యవసరం.

**సొంతవైద్యం వద్దు:** కండ్లకు ఏదైనా ఇబ్బంది వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్లకుండా మనకు తెలిసిన వైద్యమో, తెలిసినవాళ్లు చెప్పిందో చేసేసుకుంటూ ఉంటాం. ఇక స్థానిక మందుల దుకాణానికి వెళ్తే కంటిమంట, అసౌకర్యానికి మామూలు డ్రాప్స్ ఇస్తాడు. అయితే, వీటిలో స్టెరాయిడ్స్ ఉండే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంలో ఇవి కండ్లకు హానిచేస్తాయి. కాబట్టి, కంటి డాక్టర్ సూచించిన డ్రాప్స్ మాత్రమే వాడాలి.

**అల్ట్రావయొలెట్ కిరణాలు:** సూర్యుడి కాంతిలో అల్ట్రావయొలెట్ (యూవీ) కిరణాలు కూడా ఉంటాయి. తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఎండలో తిరిగితే కాలం గడిచేకొద్దీ కండ్లలో శుక్లాలు, మాక్యులర్ డిజనరేషన్ (వయసు పెరిగే కొద్దీ తలెత్తే దృష్టిలోపం) లాంటి సమస్యలు తలెత్తుతాయి. సన్ గ్లాసెస్ వాడటం వల్ల అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి కండ్లను రక్షించుకోవచ్చు. మనం వాడే సన్‌గ్లాసెస్ కూడా యూవీ ఏ, యూవీ బీ రేడియేషన్ నుంచి కూడా రక్షణను ఇచ్చేవై ఉండాలి.

**సిఫారసు చేయని అద్దాలు:** కంటి చూపు బాగుండాలన్నా, కంటి సమస్యల తొలి సంకేతాలను గుర్తించాలన్నా క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి. అయితే, చాలామంది వీటి గురించి అంతగా పట్టించుకోరు. తమ చూపు బాగానే ఉందనుకుని కంటి అనారోగ్య లక్షణాలను నిర్లక్ష్యం చేస్తారు.

మరో విషయం డాక్టర్లు సూచించిన కళ్లద్దాలు వాడకపోతే సమస్య ముదిరిపోతుంది. కాబట్టి, కంటి ఆరోగ్యం కాపాడుకోవడానికి నలభై లోపువాళ్లయితే రెండేండ్లకోసారి, నలభై దాటితే ఏడాదికోసారి పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి.

# కొలోస్ట్రమ్.. గొప్ప ఫుడ్ సప్లిమెంట్!



కొలోస్ట్రమ్ పేరు మనకు అంతగా పరిచయం లేకపోవచ్చు. కానీ, ఆవు ముర్రుపాలు లేదా జున్నుపాలనే ఇంగ్లిష్‌లో కొలోస్ట్రమ్ అంటారు. దూడకు జన్మనిచ్చిన తర్వాత ఆవు పొదుగు నుంచి కొన్ని రోజులపాటు విడుదలయ్యే ముర్రుపాలను 'ద్రవరూప బంగారం' (లిక్విడ్ గోల్డ్)గా భావిస్తారు. ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, యాంటిబాడీస్ పుష్కలంగా ఉండే ఆవు ముర్రుపాలు మన శరీర కణాల మరమ్మతు, గాయాలు మాన్పడం, రోగ నిరోధక వ్యవస్థ, పొట్ట ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయని వివిధ అధ్యయనాల్లో వెల్లడైంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ముర్రుపాలను భారతదేశంలో వేల సంవత్సరాల కిందటే ఆయుర్వేద వైద్యంలో ఉపయోగించారు. వీటిపై శాస్త్రీయ అధ్యయనం 1799లో క్రిస్టఫ్ విల్‌హెల్మ్ హూఫ్‌లాండ్ నిర్వహించాడు. మన ఆరోగ్యానికి అండగా నిలిచే ఆవు ముర్రుపాలు ఇప్పుడు పొడి, ట్యాబ్లెట్ల రూపంలో సప్లిమెంట్లుగా దొరుకుతున్నాయి. వీటి మేలు గురించి తెలుసుకుందాం.

అథ్లెట్ల ప్రదర్శన మెరుగుపడటానికి, వాళ్లు గాయాల నుంచి త్వరగా కోలుకోవడానికి కొలోస్ట్రమ్ సాయపడుతుంది. కొలోస్ట్రమ్‌లో ఇమ్యునోగ్లోబ్యులిన్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన రోగ నిరోధక వ్యవస్థకు గొప్పశక్తినిస్తాయి. దీంతో మనం ఇన్ఫెక్షన్ల బారినపడే ముప్పు తగ్గుతుంది. రోజుకు ఒకటి చొప్పున కొలోస్ట్రమ్ సప్లిమెంట్ తీసుకునే 79 శాతం మంది లాలాజలంలో యాంటి బాడీస్ మోతాదు పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు. అలా ఈ సప్లిమెంట్లు మన శ్వాసనాళాన్ని ఇన్ఫెక్షన్ల బారినపడకుండా నివారిస్తాయట. అంతేకాదు.. కొలోస్ట్రమ్‌లో లాక్టోఫెరిన్, లైసోజైమ్ అనే యాంటిమైక్రోబియల్ (సూక్ష్మజీవి నిరోధక) ప్రొటీన్లు ఉంటాయి. ఇవి ఎన్నో ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి మనకు రక్షణను ఇస్తాయి. అయితే కొలోస్ట్రమ్ సప్లిమెంట్లను పాలంటే అలర్జీ ఉన్నవాళ్లు కొంచెం ఆలోచించి తీసుకోవాల్సి ఉంటుంది. పైగా వీటికి అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) నుంచి అనుమతులు కూడా రాలేదు. ఇక ఈ సప్లిమెంట్లు మోతాదు మించితే కడుపు ఉబ్బరం, డయేరియా లాంటి జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. చిన్నపిల్లలు, బాలింతలు వీటిని తీసుకోకూడదు. ఎవరైనా సరే డాక్టర్ల సలహా మేరకే సప్లిమెంట్లను తీసుకోవాలి. కొలోస్ట్రమ్‌కు ఇదే నియమం వర్తిస్తుంది.

# కోలీవుడ్‌లో మహిళల రక్షణకు ఓ కమిషన్!

తిరువనంతపురం,: మలయాళ చిత్రపరిశ్రమలో నటీమణులపై వేధింపులకు సంబంధించి జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక దేశ్యాప్తంగా అలజడి రేగింది. దీంతో తమిళ చిత్ర పరిశ్రమ ముందస్తు చర్యలు చేపట్టింది. కోలీవుడ్‌లో మహిళల రక్షణకు ఓ కమిషన్ ఏర్పాటు చేసింది సౌత్ ఇండియన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నడిగర్ సంఘం. ఈ కమిటీకి నటి రోహిణిని అధ్యక్షురాలిగా నియమించింది. నడిగర్ సంఘం 68వ జనరల్ కౌన్సిల్ సమావేశం ఆదివారం చెన్నైలోని కామరాజర్ అరంగంలో జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు. జనరల్ కౌన్సిల్ సమావేశంలో నడిగర్ సంఘం అధ్యక్షు డు విశాల్, కోశాధికారి నాసర్, కార్తీతోపాటు పలువురు పాల్గొన్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి ఫిర్యాదు అందిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, నటుడు విశాల్ తెలిపారు. రోహిణి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. రోహిణీతోపాటు మరో నటి సుహాసిని ఈ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తారని చెప్పారు. నడిగర్ సంఘంలో సభ్యత్వం లేని వారైనా సరే... ఎలాంటి సమస్య ఎదుర్కొన్నా ఫిర్యాదు చేయొచ్చని అన్నారు. సీనియర్ యాక్టర్, కొత్త నటుడు, దర్శకుడు, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్.. ఇలా ఎవరిపై ఫిర్యాదు వచ్చినా... తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపుల సమస్యను చాలా సీరియస్‌గా తీసుకు న్నామని అన్నారు నడిగర్ సంఘం ప్రెసిడెంట్, నటుడు నాజర్. అందుకే కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కమిటీలో న్యాయ వాదులు కూడాఉంటారన్నారు. ఇది తమ తొలి అడుగు అని చెప్పారు నాజర్. ఇండస్ట్రీలో పనిచేసే మహిళలకు ఒక నమ్మకాన్ని కలిగిస్తున్నా మన్నారు. జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్. దేశవ్యాప్తంగా చర్చనీయాం శంగా మారింది. ఈ క్రమంలో తమకు ఎదురైన వేధింపుల గురించి నటీమణులు ధైర్యంగా బయటకు వచ్చి మాట్లాడుతున్నారు.

# హాలీవుడ్ రేంజ్ లో పాస్టర్.. ఎట్టకేలకు అరెస్ట్...

న్యూఢిల్లీ, : స్వయం ప్రకటిత దేవుళ్లుగా చలామణి అయ్యేవారిని మనం చాలా మందిని చూస్తూనే ఉంటాం. బాబాలు, పాస్టర్ల పేర్లతో తాము దేవుళ్లు పంపిన దూతలు అని.. తామే దేవుళ్లమని.. ప్రజలను నమ్మించి అడ్డంగా దోచుకునే దొంగల లోగుట్టు ఇప్పటికి ఎంతోమందిది బయటపడింది. అమాయక ప్రజలను మోసం చేస్తూ.. వారి నుంచి డబ్బులు దండుకుని.. ఒక సామ్రాజ్యమే ఏర్పాటు చేసుకున్న వారు చాలా మంది ఉన్నారు. భక్తి, దేవుడి ముసుగులో అక్రమ కార్యకలాపాలు సాగిస్తూనే ఉంటారు. డబ్బు, డ్రగ్స్, అమ్మాయిలు, ఆయుధాలు, ఉగ్రవాదులు.. ఇలా చట్టవ్యతిరేక పనుల్లో భారీగా డబ్బులు దండుకుంటూ ఉంటారు. ఇలాగే ఓ పాస్టర్ చేస్తున్న అరాచకాలను తట్టుకోలేని ప్రభుత్వం అతడ్ని అరెస్ట్ చేయాలని ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు 2వారాలపాటు అనేక రకాల ప్రయత్నాలు చేసి ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన ఫిలిప్పీన్స్‌లో చోటు చేసుకుంది.ఫిలిప్పీన్స్‌లోని దావోవ్ నగరంలో తన సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని అనేక అరాచకాలకు పాల్పడుతున్న పాస్టర్ అపోలో క్విబోలాయ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విశ్వం మొత్తానికి తాను యజమానిని అని.. అంతేకాకుండా దేవుడు ఎంపిక చేసిన బిడ్డను అని ప్రకటించుకున్న అపోలో.. ఏకంగా ఒక సామ్రాజ్యాన్నే ఏర్పాటు చేసుకున్నాడు. ది కింగ్‌డమ్ ఆఫ్ జీసెస్ క్రైస్ట్ పేరుతో 75 ఎకరాల్లో ఒక పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. ఇందులో 75వేల సీట్ల కెపాసిటీ ఉన్న ఒక భారీ స్టేడియంతోపాటు ఓ ప్రార్థనా మందిరం, మరో 40 బిల్డింగ్‌లు ఉన్నాయి. ఇక అతడికి 70 లక్షల మంది భక్తులు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారుఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్టోకు అపోలో క్విబోలాయ్ బాగా దగ్గరి వ్యక్తి. అంతేకాకుండా రోడ్రిగో డ్యూటెర్టోకు ఆధ్యాత్మిక సలహాదారుడిగా కూడా ఈ అపోలో క్విబోలాయ్ పనిచేశారు. అయితే రోడ్రిగో ఫిలిప్పీన్స్ అధ్యక్ష పదవి నుంచి దిగిపోయినప్పటి నుంచి అపోలోకు కష్టాలు ప్రారంభం అయ్యాయి. ఈ క్రమంలోనే 2021లో అపోలో క్విబోలాయ్‌పై అమెరికాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ పలు అభియోగాలను మోపింది. చిన్న పిల్లలను సెక్స్ రాకెట్‌లోకి దింపడం.. ప్రజలను మోసం చేయడం.. భారీగా డబ్బును స్మగ్లింగ్ చేయడం వంటి అనేక కేసులను అపోలో క్విబోలాయ్‌పై మోపారు. ఫిలిప్పీన్స్ నుంచి అతడు బాలికలు, మహిళలను అమెరికాకు తరలిస్తున్నట్లు అమెరికా ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎఫ్‌బీఐ పేర్కొంది. అంతేకాకుండా చారిటీ రూపంలో డబ్బును అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించింది. తన వ్యక్తిగత మహిళా సహాయకురాళ్లతో అతడు లైంగిక వాంఛలను తీర్చుకున్నట్లు కూడా అపోలో క్విబోలాయ్‌పై అనేక అభియోగాలు నమోదయ్యాయి.

దుబాయ్‌లో చిక్కుకున్నవారికి గుడ్‌న్యూస్‌అతడిపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలాగైనా సరే అపోలో క్విబోలాయ్‌ని అరెస్ట్ చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఏకంగా 2 వారాల పాటు సాగిన హైడ్రామా అనంతరం ఆదివారం అతడ్ని అరెస్ట్ చేశారు. 'ది కింగ్‌డమ్ ఆఫ్ జీసెస్ క్రైస్ట్' సామ్రాజ్యాన్ని దాదాపు 2వేలమంది పోలీసులు ముట్టడించారు. అది తెలుసుకున్న అపోలో మద్దతుదారు లు.. దాని చుట్టూ ఒక కవచంలా ఏర్పడి భద్రతా దళాలు లోపలికి రాకుండా అడ్డుకున్నాయి. దీంతో పోలీసులు హెలికాప్టర్లను రంగం లోకి దించారు. ఈ క్రమంలోనే 2 వారాలపాటు ఈ ఆపరే షన్ జరిగింది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215